5A 39290

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం



నాకు స్ఫూర్తినిచ్చిన పుస్తకం

కథా నిలయం
శ్రీకాకుళం

మార్చి 29, 2009

ఆయారాం... గయారాం...

హ్యాపీ బర్త్‌డే

(2009 మార్చి 21 నుంచి
2009 ఏప్రిల్ 4 వరకు)

కె. అభినయ్
6సం॥, మార్చి-2003
అనురాధ-వెంకటేష్
సుందరయ్యకాలనీ-నెల్లూరు

అయ్యాజ్ అహ్మద్
6సం॥, మార్చి-2003
అతియాబాను-దస్తగిరిఅహ్మద్
శిరోమణినగర్-నెల్లూరు

ఫహినాజ్
1సం॥, ఏప్రిల్-3
రియాజున్నిస-హబీబ్‌ఖాదర్
కడప

ఎస్. తరుణ్‌తేజ
10సం॥, ఏప్రిల్-3
నాగమణి-జగన్నాథరావు
బిహెచ్‌పివి-విశాఖపట్నం

ఎన్. నవీన్‌కుమార్
6సం॥, మార్చి-2003
అనురాధ-గోపాల్
మూసాపేట్-హైదరాబాద్

సిహెచ్. కావ్య
మార్చి
వెంకటరమణ-ఎల్లయ్య
పినిరెడ్డిగూడెం-ఖమ్మం

బి. ప్రియమణి
మార్చి
రమణ-ఉపేందర్
కామంచికల్లు-ఖమ్మం



సైఫన్
2సం॥, మార్చి-29
మైమున-ఖాన్‌పాషా
మనాజ్‌పేట-మ॥నగర్

టి. సుమంత్
9సం॥, మార్చి-31
పద్మ-వీరారెడ్డి
విద్యానగర్‌కాలనీ-
నల్లగొండ

కె. శ్రావ్య
1సం॥, ఏప్రిల్-1
రాధిక-రమేష్‌బాబు
కైకలూరు-కృష్ణా

దర్శ్
2సం॥, మార్చి-30
రచన-రాకేశ్
హైదరాబాద్

కె. మురళి
10సం॥, మార్చి-29
రామేశ్వరి-శ్రీరాములు
పెబ్బేర్-మ॥నగర్

శశిత
4సం॥, ఏప్రిల్-4
కరీమున్నిస-హమీద్‌హుస్సేన్
కడప

శివమణి
1సం॥, మార్చి-2008
పుష్ప-కమల్
కనగర్తి-పెద్దపల్లి

ఇ. నిశాంక్
మార్చి-30
సుజాత-రవి
వల్లాపురం-ఖమ్మం

లక్ష్మిప్రసన్న
మార్చి-29
ఉమారాణి-మధుకృష్ణ
వెంకటాయపాలెం-ఖమ్మం

చరణ్
మార్చి-31
సుమలత-నాగరాజు
వెంకటాయపాలెం-ఖమ్మం

కె. మధుసాయి
6సం॥, మార్చి-29
పల్లవి-కృష్ణ
పెబ్బేర్-మ॥నగర్

షేక్ సానియా-సదాఫ్
4సం॥, మార్చి-31
షేక్‌ఫర్జానా-సర్దార్
పర్చూరు-ప్రకాశం

మనలో మాట

ఏప్రిల్ ఫూల్ చేస్తారు జాగ్రత్త!

అసలే ఎన్నికలు. ఆ పై ఏప్రిల్ ఫస్ట్. ఓటరు మహాశయా బహు పరాక్! ఏమాత్రం పరాగ్గా వున్నా అంతే సంగతులు. అధికారానికి వీసా లాంటి నీ ఓటు చేజిక్కించుకోవడం కోసం వంగి వంగి దణ్ణాలు పెడతారు. ఎన్నడూ పేదల వైపు కన్నెత్తి చూడని నేతలు ప్రజా సేవ గురించి లెక్చర్లిస్తారు. ఓటేసేదాకా ఓటు మల్లన్న ఓటేశాక బోడి మల్లన్న అంటారు. ఓటుకు నోటు ఇస్తారు. తీరా గెలిచాక అంతకు వందల వేల రెట్లు ప్రజా ధనం స్వాహా చేస్తారు. పైసా ఖర్చు లేని హామీలను కుప్పలు తెప్పలుగా కురిపించడంలో ఒకరికొకరు పోటీ పడతారు. గతంలో చేసిన వాగ్దానాల సంగతి గురించి ప్రస్తావిస్తే 'ఆ ఒక్కటే అడక్కు' అంటారు. అడిగేవాడికి చెప్పేవాడు లోకువ అన్నదానిని తిరగేసి చెప్పేవాడికి వినేవాడు లోకువ అనుకోమంటారు. ధరలు మండిపోతుంటే ద్రవ్యోల్బణం తగ్గించాం చూడండంటారు. మాంద్యం దెబ్బతో ఉద్యోగాలు ఊడుతుంటే సంవత్సరానికి కోటి ఉద్యోగాలిచ్చామంటూ గోబెల్స్‌ను తలదన్నేలా ఊదరగొడతారు. ప్రజలిచ్చిన అధికారాన్ని ప్రజలకోసమే వినియోగిస్తున్నామంటారు. అయిదేళ్ల క్రితం వున్న ఆస్తులకు ఇప్పుడున్న ఆస్తులు వందల వేల రెట్లు ఎలా పెంచుకున్నారో చెప్పరు. పేదలకు చెందాల్సిన భూములు, వనరులు పెద్దలకు కట్టబెడుతూ పేదల సంక్షేమమే తమ ధ్యేయమంటారు. పథకాల చిట్టా విప్పతారు. రకరకాల హామీలు, పథకాలతో అరచేతిలో స్వర్గం చూపిస్తూ, మీ చెవిలో పూలు పెట్టాలని చూస్తారు. ఏప్రిల్ ఫస్టన మనల్ని ఫూల్స్ చేయాలని చూస్తారు. ఒక్కసారి మనం ఫూల్ అయితే అయిదేళ్ల దాకా మనపై వాళ్లు స్వారీ చేస్తారు. ఇదంతా ఏప్రిల్ ఫస్ట్ వేళా విశేషం అని సరిపెట్టుకోకుండా మాయమాటలతో మభ్య పుచ్చే కోతల రాయుళ్లకు ఏప్రిల్ ఫస్ట్ సదా గుర్తుండిపోయేలా ఏదో ఒకటి చేయాలి.

అది ఏమిటి? ఎలా అన్నది మీ ఇష్టం.

★

ఈ సంచికలో....

టపా	...	2
కవిత్వమ్	...	3
జోక్స్	...	5
స్ఫూర్తి	...	8
గని నవలా రచయిత చిన్నప్పభారతి పరిచయం	...	11
బాలనేస్తాలు	...	12
అట్టమీది కథ	...	14
రుచి	...	17
చూద్దామా	...	20
ఆరోగ్యం	...	22
తెల్సా	...	24

ఇంకా...

అమెరికాలో వారాంతం ఇలా...4

తెలుసుకుందామా ...6
అభద్రతలో అపురూప సంపద

కథ ... 18
స్పందించని సమాజం

చర్మ సంరక్షణ ఇలా ... 23



'ఓట్లు - నోట్లు' కవర్ బావుంది

మార్చి 15 ఆదివారం సంచికలో ప్రచురించిన 'ఓట్ల వేటలో కోట్ల మూటలు...కొత్త బాటలు...' వ్యాసంలో నేటి ఎన్నికల యదార్థస్థితిని చక్కగా విశదీకరించారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికలంటే ఓట్లు మాత్రమే కాక నోట్లకు గల ప్రాముఖ్యత లోక విదితమే. ఎన్నికల్లో నిలబడే వ్యక్తులు టిక్కెట్లు రావడానికి, పదవులు రావడానికి గెలుపు ముఖ్యం కనుక ఆ గెలుపు రావాలంటే ఎంతో ఖర్చు పెట్టవలసి ఉంటుంది. అది మాస్ ప్రజాస్వామ్యంలో పరిపాటే. పార్టీల ద్వారా ఖర్చులకు కేటాయించిన సొమ్ము కాక, స్వంతంగా ఎంతో ఖర్చు చేస్తేనే కానీ గెలుపు ఓటములు తెలియవు. వ్యాసకర్తకు ధన్యవాదాలు.

ఆచార్య నూతి నారాయణరావు,
హైదరాబాదు.

ఉప్పు హోటల్ వుందా!

బడా పెట్టుబడి దారులు, దేశాన్ని, రాష్ట్రాన్ని దోచి ఎన్నికలలో పాల్గొంటున్నారు. ఓటుకు పెద్ద నోటు (1000) ఇవ్వబోతున్నారు. పార్టీలతో నిమిత్తం లేకుండా సుమారైన నీతిమంతునికి ఓటు వెయ్యాలి. పుచ్చకాయ ఎర్రదనమూ, చల్లదనమూ హాయిగా ఉంటుంది. ఈసారి పసందైన పచ్చళ్ల అల్లం, పండుమిరపకాయ పచ్చడి, నిమ్మకాయ, గోంగూర పచ్చడి రుచుల్లో చతుర్వేదాలు. అద్భుతం... అద్వితీయం అంటూ రాసిన చిత్తోడ్‌ఘడ్ చరిత్ర బాగుంది. ఉప్పు హోటల్ విచిత్రంగా ఉంది. హ్యాపీ బర్త్‌డే, కలం స్నేహం రెండూ బాగున్నాయి. చిరునామాలు మారాయే. కొత్త భవనాలా?!

వాస్తు రామచంద్ర,
రాంజీనగర్, నెల్లూరు.

ప్రచారంలో నవీన పోకడలు

అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా ప్రపంచ దేశాల్లో ప్రత్యేకతను కల్గిన మన భారతదేశంలో త్వరలో జరగనున్న ఎన్నికల సందర్భంగా విజయాన్ని సాధించడానికి వివిధ రాజకీయ పార్టీల నేతల ప్రచార కార్యక్రమాల్లోని నవీన పోకడల గురించి మార్చి 15వ తేదీ ఆదివారం సంచిక స్నేహ అట్టమీది కథ ద్వారా అనేక విషయాలు తెలుసుకున్నాం. ఒకనాడు ప్రధాన ప్రచార మార్గాలుగా ఉన్న సభలు, ప్రదర్శనలు నేడు ఎంతో ముందడుగు వేసి వెబ్‌సైట్లు, ఎస్.ఎమ్.ఎస్ ల వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నారు. ఓటర్లను ఆకట్టుకోవడానికి తంటాలు పడుతున్న నాయకుల ఆధునిక ప్రచార పోకడలను గురించి తెలుసుకోవడానికి ఈ కవర్ స్టోరీ ఉపయోగపడింది. అలాగే ఎన్నో చారిత్రక సంఘటనలకు సజీవ సాక్ష్యంగా నిలిచిన రాజస్థాన్‌లోని చిత్తోడ్‌ఘడ్ నందలి ప్రముఖ పట్టణాల గురించిన ప్రత్యేకతలను గురించి తెలుసుకుందామా శీర్షిక ద్వారా తెలుసుకున్నాం. ఎండాకాలంలో ప్రజలకు ప్రకృతి ప్రసాదించిన వరంలా భావించే పుచ్చకాయ గురించిన విశేషాలను కూల్‌కూల్‌గా... శీర్షిక ద్వారా అందించినందుకు ధన్యవాదాలు.

గొల్లమందల సురేష్ కుమార్, సీతారాంపురం, ఖమ్మం.

కఠిన చర్యలు తీసుకోవాల్సిందే

1957 నుండి 2009 వరకు ప్రపంచ దేశాలలో అత్యంత ప్రజాస్వామ్య దేశంగా భాసిల్లిన భారత దేశ ఎన్నికలు గురించి అట్టమీది కథలో విపులంగా వివరించారు. ప్రస్తుతం మన దేశంలో కేవలం ఎన్నికల ఖర్చుకు పదివేల కోట్ల రూపాయలు ఖర్చవుతున్నాయని తెలిసి అమ్మో అనిపించింది. ప్రజా సమస్యలపై ఏమాత్రం దృష్టి కేంద్రీకరించని పాలకుల ఎన్నికకు అంత ఖర్చా? అనిపించింది. అదే ఎన్నికలు జరగకుంటే ఓ సామాన్య రాష్ట్రానికి బడ్జెట్‌గా సరిపోయేది. మ్యానిఫెస్టోలు సక్రమంగా అమలు చేయకపోతే పార్టీ గుర్తింపు రద్దు చేయడంతోపాటు ప్రభుత్వాన్ని సాగనంపే విధంగా ఎన్నికల సంఘం కఠిన చర్యలు చేపడితే కొంతలో కొంత మార్పు సంభవించవచ్చేమో!

యర్రమోతు ధర్మరాజు,
ధవళేశ్వరం.

పుచ్చకాయల వివరాలు సూపర్

మార్చి 15వ తేదీ స్నేహ సంచికలో పుచ్చకాయల విశేషాలు ఆసక్తికరంగా ఉన్నాయి. మనలో మాటగా నేడు అమెరికా ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభం వల్ల అక్కడున్న భారతీయులే కాదు, అమెరికన్లు కూడా ఎన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారో! సినిమా కబుర్లు బాగున్నాయి. అట్టమీది కథలో వచ్చిన ఓట్ల వేటలో కోట్ల మూటలు... కొత్త బాటలు... అంటూ నేడు రాజకీయ నాయకులు ఓట్ల కోసం ఎన్ని తిప్పలు పడుతున్నారో, ఇంకెన్ని వేషాలు వేస్తారో చక్కగా చెప్పారు. వాళ్ల ప్రచార పోకడలు మరీ వింతగా ఉన్నాయి. మీడియాలు ఎన్ని రకాలో అన్నింట్లోనూ విపరీతంగా ప్రచారం చేసుకొంటున్నారు. అవి మరీ విసుగు పుట్టించేవిగా ఉంటున్నాయి. లవణం హోటల్ వింతగా ఉంది.



నాకూ ఐస్‌క్రీం కావాలి అంటూ పక్షులు కూడా ఐస్‌క్రీం కోసం పోటీ పడతాయేమో?

విజయలక్ష్మి, అనంతపురం.

సందర్భానుసారంగా కవర్

మార్చి 15, 2009 నాటి స్నేహ అట్టమీది కథగా ఓట్లవేటలో... వ్యాసం తెలకపల్లి రవిగారు సందర్భానుగుణంగా అందించటం బాగుంది. సినిమా కబుర్లు ప్రెజెంట్ చేసే తీరు మారినట్లు కనిపిస్తోంది. లవణంతో నిర్మించిన హోటల్, ఐస్‌క్రీం ఇష్టంగా లాగించే పక్షి న్యూస్ ఆకట్టుకున్నాయి. చేతిరుమాళ్లపై వార్తలు ప్రచురించే కొత్త ఆలోచన 'తెల్సా' ద్వారా తెలుసుకుని ఆశ్చర్యపోయాం. నోరూరించే పుచ్చ గురించి కూలంకషంగా తెలుసుకున్నాం. శ్రమైక 'జీవనసౌందర్యం' కథ బావుంది. ఈవారం కూడా చిత్తోడ్‌ఘడ్ చరిత్ర, ప్రాధాన్యత, ప్రత్యేకతల సమాచారం మరింతగా తెలుసుకోగలిగాం. కొత్తపుస్తకాల ద్వారా నాటకప్రియులకు అభిమాన పాత్రమైన 'తెలుగు నాటకం-సామాజిక చైతన్యం' చాలా అమూల్యమైనదని భావించవచ్చు. 'మనలో మాట'లో ఆహా అమెరికా కాస్తా అమ్మో అమెరికా! అవటం కాల మహత్యమే కదా! అనిపించింది.

నేమాన సుభాష్‌చంద్రబోస్,
ఇలిసిపురం, శ్రీకాకుళం.

వాడి అంతరంగం తెలిశాకే.....!

- జి. లెనిన్ శ్రీనివాస్



నిరసనల పర్వం నిలువెత్తున దహిస్తున్నా
మైకం ముసిరిన మత్తులో
సంపద దోచే సయ్యాటలో
సమరం సృష్టించడం వాడి నైజం!
కలలను కాటేయడం
కన్నీళ్లను వ్యాపారం చేయడం
మానవతా విలువలను మంట గలపడం
అన్నీ... వాడి చేతిలో శాసనాలే!
న్యాయాలు, నిర్ణయాలు
దండనలు, దయాదాక్షిణ్యాలు
డాలర్ల పంటలో, దౌర్జన్యాల వేటలో
అన్నీ.... వాడి ఆట బొమ్మలే!
అణిగి అవమానాలు భరించి
తాకట్టుపడ్డ తనువులు తల్లడిల్లి
నియంతను నిలదీసి
శత్రువు బలం తెలిసి
బలహీనత ఎగిరి కూడా....
ఛిద్రమౌతున్న దృశ్యాలను కూడదీసి
శాసించేవాణ్ణి నిరసించి
శ్వేత సౌధాన్ని నిలదీయడానికి
వివక్షత ప్రశ్నార్ధకంగా
ఉప్పొంగిన ఆవేదన, ఉరకలెత్తిన నిరసన
నయవంచనపై విసిరిన సవాల్
కుయుక్తులపై భగ్గున రేగిన జ్వాల
కలం ఆయుధం చేసిన యోగి
హీన సంస్కారానికి హితవు పలికి
చచ్చిన ఒంటి సత్తువను కూడదీసి
రగిలిన చిచ్చు మదిలో మెదిలి
నిత్య నిఘా నీడను ఛేదించి
ఉక్రోషం, ఉద్వేగం ఉలిక్కిపడ్డ
ప్రపంచ నాలుకపై
నర్తించిన సందేశం!
అవమానం అంశీకరించిన
మొండి మెదడుకు
తీరని తప్పిదాన్ని గుర్తుచేసిన సంకేతం
ఇక వాణ్ణి బూట్ల నీడలే
భూతాలై భయపడతాయి!!

కవిత్వమ్

వాయిదా...! (వ్వా!యిదా?)

- ఎస్. భారతీ విశ్వనాథ్

నిన్ననుకున్నది ఈ రోజు
నేడనుకున్నది రేపు ఇలా...
ఏ రోజుకారోజు కాసేపు, రేపు అని ఇలా
అమ్మ ఒడిలోంచి హడావిడిగా
బయటపడ్డ క్షణం నుండి
నిన్న నేటి వరకు కూడా వాయిదా పద్ధతి
"వాయిదా పద్ధతిని వాయిదా వేద్దామనుకొని
చేయాల్సిన పనిని వాయిదా వేస్తున్న...."
చేస్తున్న పని తప్పని తెలిసి
ఏ ఒకటో అరో విజయం సాధించాక
ఇక నుండి ఇలాగే చేయాలనుకున్న
ఆచరించి సాధించే వాడిలా... కానీ....
నిన్నది సాధించాం కదా... ఇంకెంత అనే గర్వం
నన్ను వాయిదాకి బానిసను చేసింది.
బానిస బ్రతుకు తెలియనిదా? మీకు .... ఎలా
వుంటుందో...
కాలమున్నదని
నువ్వు చేయలేదని
నీ చావు వాయిదా వేయడుగా ఆ బ్రహ్మ
"ఉన్న కాలాన్ని ఉపయోగించుకోలేక
వుంటుందో లేదో తెలియని మరో
ఉదయం కోసం ఎదురు చూస్తూ...
కాలాన్ని వృధా చేశామని బాధపడడం కూడా
వాయిదా వేసి బాధపడుతున్న
వాయిదాకి బానిసనై"
చేస్తున్నాడేదో.... మావాడు
సాధిస్తాడేదో... మావాడు
అన్న ఆకాశాన్నంటే ఆశలతో....
నిరాశకు గురై
వ్వా....!ఇదా? నువ్వు సాధించింది.
అన్న ఈ మాటలు వినడానికా
నేనీ "వాయిదా" వేసింది అని
ఇప్పుడు బాధపడుతున్నా... వాయిదా

బానిస బ్రతుకు నుండి విముక్తి కాలేదని...
............విముక్తి పొందాలని...

★

అమెరికాలో వారాంతం ఇలా...



- ముక్తవరం వసంతకుమారి

హలో శశీ, ఎలా ఉన్నావు? నిన్ను చూడాలనిపిస్తోందే! ఎప్పుడెప్పుడు ఇండియా వద్దామా అనివుంది. కానీ అనుకున్న వెంటనే చూడ్డానికి కుదరదుగా. ఇలా వీకెండ్స్‌లో మెయిల్స్‌లో మనసులోని మాట చెప్పుకుని తృప్తి పడడమో, లేక ఫోన్లలో మాట్లాడి సంతోషపడడమో అవుతోంది.

ఏం వీకెండో ఏంటో! ఇలా వచ్చి అలా వెళ్లిపోతుంది. దూరంగా ఉన్న మీకు అలానే అనిపిస్తుంది. అసలు వీకెండ్స్‌లోనే ఆఫీసు పని తప్ప మిగతా పనులన్నీ చక్కబెట్టుకోవాల్సి వస్తుంది. శుక్రవారం సాయంకాలం నుండే ఇక్కడున్న స్నేహితులకు ఫోన్లు చేయడంతో మొదలవుతుంది. రోజూ ఉండే రొటీన్ పని నుండి బయట పడటానికి ఎప్పుడెప్పుడు వీకెండ్ వస్తుందా అని ఎదురుచూస్తాం. మా పిల్లలిద్దరిలో పెద్దపాపేమో స్కూల్‌కి వెళ్తుంది. చిన్నపాపకు ఇంకా ఒక సంవత్సరమేగా. ఇంట్లోనే ఉంటుంది. మా వారు ఇంట్లోనే ఉండి స్వంతంగా బిజినెస్ నడుపుతున్నారు. అందుకని ఆయనకు తీరిక ఉండదు. చిన్న పాపను నానీ సాయంతో మా వారే చూసుకుంటారు. పెద్దపాపకు స్కూల్ 11గంటలకు. నేనేమో ఉదయం 8 గంటలకే ఆఫీసుకు వెళ్లాలి. అందుకని పెద్దపాపను నేను వెళ్లేప్పుడే డేకేర్‌లో డ్రాప్ చేస్తాను. 11 గంటలకు వాళ్లే స్కూల్‌కి తీసుకువెళ్తారు. తిరిగి సాయంకాలం 5 గంటలకు నేను తిరిగి వచ్చేప్పుడు పాపను తీసుకుని వచ్చేస్తాను. ఇక తిండి విషయానికి వస్తే రోజూ అమెరికన్ సలాడ్స్, సబ్‌వే ఫుడ్ తినలేక చస్తున్నాను. ఈ హడావిడిలో రోజూ ఇంట్లో మన ఇండియన్ వంట చేసుకోను కుదరదు కదా. అందుకే వీకెండ్స్‌లో శుక్రవారం త్వరగా ఇంటికి వెళ్లి వంట చేసుకుంటాం. ఇక్కడ మాకు ఫ్రైడే అంటే మేము ఫ్రై అయ్యే రోజులాగే ఉంటుంది.

> **ఏ పండగైనా వచ్చిందంటే దానికి ముందుగానీ, తర్వాత గానీ వీకెండ్స్ వచ్చేలా చూసుకుని పండగ జరుపుకోవడం ఆనవాయితీ. అవసరం కొద్దీ పండుగలను చేసుకుంటాం. వీలు చూసుకుని గుడికి వెళ్తుంటాం. ఎందుకంటే అది 40, 50 నిమిషాల డ్రైవ్ దూరంలో ఉంటుంది మరి.**

ఇక తెల్లవారితే శనివారం కదా. ఉదయమే లేవక్కర్లేదని ఫ్రైడే రాత్రి పొద్దు పోయేదాకా అయ్యో ఇంత దూరంలో ఉన్నాం కదా. మన బంధువులెవ్వరూ దగ్గరలేరు అన్న బెంగతో ఇండియాలో ఉన్న చుట్టాలతో ఫోన్లలో మాట్లాడతాం. తెలుగు సినిమాల సీడీలు తెచ్చుకుని చూస్తాం (పైరేటెడ్ సినిమాలు ఇక్కడికి త్వరగానే వస్తాయి). మరి ఇండియాలో మన వాళ్లవాళ్లంతా సినిమాలు చూస్తోంటే మేము వెనకబడిపోతామని. ఇంకా ఇక్కడి స్నేహితులు 2,3 సార్లు పిలిచారంటే మళ్లీ వాళ్లని పిలవాలి కదా. అందుకు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి.

పిల్లలను బయటికి తీసుకెళ్లడానికి శనివారం మాత్రమే కుదురుతుంది. ఆదివారమైతే బట్టలు వుతుక్కోవాలి. పని మనుషులు ఉండరు (ఉన్నా అందుబాటులో ఉండరు. ఇక్కడ గంటకు 15 నుండి 20 డాలర్లు), పని మెషీన్లు ఉంటాయి. ఇల్లు ఊడ్చే పనైతే ఉండదు కానీ బాత్రూమ్‌లు క్లీన్ చేసుకోవాలి. ఇంకా ఆరోజే అవసరమైన సరుకులు, పాలు, పండ్లు, కూరగాయలు అన్నీ వారానికి సరిపడా తెచ్చుకోవాలి. ఆ షాపులు కూడా ఏమైనా దగ్గరగా ఉన్నాయా అంటే అలా ఏం వుండవు. 20, 30 నిమిషాల డ్రైవ్ దూరంలో ఉంటాయి. ఇక్కడ రెడీమేడ్ ఫుడ్ కూడా దొరుకుతుంది.

పిల్లలను లైబ్రరీకి తీసుకెళ్తాం. స్టోరీ టైం అని టీచర్ ఓ గంట ఆసక్తికరంగా చెప్తుంది. క్రాఫ్స్, పెయింటింగ్ లాంటి సృజనాత్మకమైన అంశాలను పిల్లల్లో పెంపొందించడానికి చాలా అనువైన ప్రదేశం లైబ్రరీ. ఎన్నో విలువైన పుస్తకాలు అందుబాటులో ఉంటాయి. చిన్న పిల్లల చిత్రాల సీడీలు కూడా ఇక్కడే తీసుకోవచ్చు. పిల్లలను మ్యూజియం, జూలకు తీసుకెళ్తారు. జంతువుల బొమ్మలను గుర్తించడానికి ఆ బొమ్మల స్టాంపులు వేసి వాళ్లకు ఎంతో విజ్ఞానాన్ని అందచేస్తారు. ఎన్నో సదుపాయాలను పిల్లలకు అందజేయాలి....

సరేలే నాకంటే భర్త, ఇద్దరు పిల్లలూ, ఆఫీసు ఉండడంతో అలా అంటున్నా. జానకి వాళ్లది కొత్తగా పెళ్లైన జంట కదా. దాని సంగతులు చెప్తా...

జానకీ, శ్రీకర్ హాయిగా ఉన్నారే. శుక్రవారం సాయంకాలం త్వరగా వచ్చేస్తాడు. శ్రీకర్‌కు ఆటలంటే ఆసక్తి ఉండడంతో గోల్ఫ్ క్లబ్, బౌలింగ్ సెంటర్, టెన్నిస్ కోర్టుకు గానీ వెళ్తారు. ఇక్కడికి వచ్చాక జానకికి కూడా అలవాటయింది. ఇక్కడ సినిమా థియేటర్లకు వెళ్లడం తక్కువే (ఎక్కడో 30, 40 నిమిషాల డ్రైవ్ దూరంలో ఉండడం వల్ల). బ్లాక్ బస్టర్ నుండి సీడీలు, ఇండియన్ స్టోర్స్ నుండి సినిమాలు తెచ్చుకుని చూసి మరునాడు బద్ధకంగా లేవడం ఇక్కడ ఆనవాయితీ. ఎప్పటికో మెల్లగా లేచి బ్రేక్ ఫాస్ట్ చేసి మాల్స్‌కు వెళ్లడం. సామ్స్ క్లబ్ లాంటి గ్రోసరీ షాప్‌కు వెళ్తే గంటా రెండు గంటలు పడుతుంది. మన సూపర్ మార్కెట్‌తో పోలిస్తే ఇవి పది రెట్లు పెద్దదిగా ఉంటుంది. ఇక్కడి ఒక్కో పాకెట్‌లో డజన్‌కు తక్కువ ఏదీ ఉండదు. రిటైల్ షాపువాళ్లు కొనుక్కునే షాపు. మధ్య తరగతి వాళ్లు పొదుపు చేయాలంటే ఇక్కడ కొనక తప్పదు. ఏ షాపింగ్ మాల్స్ దగ్గరికెళ్లాలన్నా 20, 30 నిమిషాలు డ్రైవ్ చేస్తేగానీ చేరుకోలేము.

ఏ పండగైనా వచ్చిందంటే దానికి ముందుగానీ, తర్వాత గానీ వీకెండ్స్ వచ్చేలా చూసుకుని పండగ జరుపుకోవడం ఆనవాయితీ. అవసరం కొద్దీ పండుగలను చేసుకుంటాం. వీలు చూసుకుని గుడికి వెళ్తుంటాం. ఎందుకంటే అది 40, 50 నిమిషాల డ్రైవ్ దూరంలో ఉంటుంది మరి. భక్తి మాట దేవుడెరుగు, భుక్తికోసం మాత్రం వెళ్తాం. దర్శనం చేసుకుని గుళ్లో పెట్టే దద్దోజనం, పులిహోర, ఇడ్లీ, దోశ లాంటి ఇండియన్ ఫుడ్ (ఈ ఇండియన్ ఫుడ్‌ని కొందరు వాలంటీర్లు కనీస ధర పెట్టి ఇస్తుంటారు) ని అక్కడ తినగలిగినంత తిని ఇంటికి ప్యాక్ చేసుకుని తెచ్చుకుంటాం.



లాంగ్ వీకెండ్ అంటే మేనెలలో వచ్చే లేబర్ డే, థ్యాంక్స్ గివింగ్ డే, జూన్ 4వ తేదీ (అమెరికా స్వాతంత్ర్య దినోత్సవం) లను వీకెండ్‌కు జత కలిపి ఇస్తుంటారు. ఈ లాంగ్ వీకెండ్స్‌లో ఏదైనా బయట టూర్స్‌కు వెళ్లడానికి ప్లాన్ చేసుకుంటాం. ఇక్కడ ఎవరినైనా ఇంటికి ఆహ్వానించాలంటే రెండు మూడు వారాల ముందుగానే చెప్పాలి.

రమా, హేమా వాళ్లు స్టూడెంట్స్ కదా, వాళ్ల యూనివర్శిటీ ఒక చిన్న నగరంలో ఉంటుంది. యూనివర్శిటీ క్యాంపస్ తప్ప దగ్గర్లో ఏమీ ఉండవు. కానీ అద్భుతమైన లైబ్రరీ ఉంటుంది. దానిని చక్కగా వినియోగించుకుంటారు. వాళ్లు ఈ కోర్సులు ఎప్పుడు పూర్తి చేద్దామా, ఎప్పుడు ఈ అప్పులు తీర్చేద్దామా అనే టెన్షన్లోనే ఉంటారు. దేశంకాని దేశంలో నలుగురైదుగురు కలిసి ఒక ఇంట్లో ఉంటారు. అతి చౌకగా వచ్చే కారుని ఒకటి కొనుక్కుని (ఇక్కడ నిత్యావసర వస్తువులు తెచ్చుకోవాలంటే కారు అవసరం) దగ్గర్లోని పట్టణానికి వెళ్లి తెచ్చుకుంటారు. వంట, ఇంటిపనులు అందరూ కలిసి చేసుకోవడం, చదువుకోవడం చేస్తుంటారు. దేశ, అంతర్జాతీయ సమస్యలన్నీ మేమే తీరుస్తున్నాము అన్న లెవల్లో చర్చలు జరిపి ఉడికీ ఉడకని, మాడిన వంటకాలు తింటారు. లేదా చౌకగా వచ్చే పిజ్జాలు, బర్గర్లూ తిని అర్థరాత్రుల వరకూ సినిమాలతో లేట్ నైట్‌లు గడిపి మరుసటి రోజు సూర్యుడు నడినెత్తికి వచ్చాక (ఎండాకాలమైతే సూర్యుడు కనిపిస్తాడు కానీ, చలికాలంలో కాదు) మేల్కొంటారు (ఒక పూట భోజనం తప్పుతుంది మరి). అమెరికాలో కలలు సాకారం చేసుకోవాలంటే చాలా శ్రమ పడాలి. బాధ్యతగా ఉంటే ఎక్కడైనా ఒకటే కదా.

ఇలా వీకెండ్స్ చాలా రకాలు మరి.

ఇప్పటికే చాలా రాత్రయింది. ఇంక వుంటానే...

బైబై ★

గోల చేసే ఆట

టింకు: ఒరే అన్ని ఆటల్లోకి భయంకరంగా గోల చేసే ఆట ఏదిరా?

బిట్టు: టెన్నిస్, ఎందుకంటే రాకెట్లు ఉపయోగిస్తారుకదా.

డక్

బ్యాట్స్‌మెన్ ఎందుకు భయపడతారు?

ఎందుకంటే డక్‌ని చూసి

రెండు కోట్లు

భార్య: మీరు రంగు వేసేటప్పుడు రెండు కోట్లు ఎందుకు వేసుకున్నారు?

భర్త: ఓసి పిచ్చిమొహమా! రెండు కోట్లు వేసుకోమని డబ్బామీద రాసి వుందే.

ఉమ్మవద్దు

జాన్: ఏంటాయన అలా పైకి ఊస్తున్నాడు..?

రామ్: నేల మీద ఉమ్మవద్దు అని అక్కడ రాసి వుందికదా. అందుకని.

ఎందువల్ల?

టీచర్: రామూ, భూమి గుండ్రంగా వుంటే మనం ఎందుకు పడిపోము?

రాము: లా ఆఫ్ గ్రావిటీ వల్ల సార్.

టీచర్: సరిగ్గా చెప్పావు.

సోము: మరి ఆ చట్టం పాస్ కాకముందు ఏం జరిగేది సార్?

ఒకరే

శ్యామ్: ఒక గొడుగు కింద ఆరుగురు నిలబడ్డారు. కానీ ఒక్కరే తడిచారు ఎలా?

రాము: అది చిన్న గొడుగు కాబట్టి

శ్యామ్: కాదు. అసలు అప్పుడు వర్షమే పడట్లేదు. ఇరుకవడంతో మధ్యలో వున్నవాడు తడిచిపోయాడు.

డెడ్

జాన్: ఏంటి? నువ్వు కారు బ్యాటరీని పూడ్చి పెడుతున్నావు?

శ్యామ్: అది డెడ్ అయ్యిందని మెకానిక్ చెప్పాడ్లే.

ఎగరలేని పక్షి...

టీచర్: సీతా! ఎగరలేని పక్షుల పేర్లు చెప్పమ్మా

సీత: ఫ్లెమింగ్ బర్డ్....

టీచర్: ఇంకా...

సీత: జైలు పక్షికూడా టీచర్

సంజన, హైదరాబాద్.

తెలుసుకుందామా...

అభద్రతలో అపురూప సంపద





ఈమధ్య మహాత్మాగాంధీ వాడిన కొన్ని వస్తువులు వేలానికి వచ్చినప్పుడు మన దేశంలో కలకలం బయలుదేరింది. ఆ వస్తువులు అమూల్యమైనవని, వాటిని ఈవిధంగా వేలంపాలు కాకుండా చూడాలని, వాటిని ప్రభుత్వం కలగచేసుకొని స్వదేశానికి రప్పించాలని వివిధ రకాల సూచనలు, వత్తిళ్ళు వచ్చాయి. కొంత మనోభావాలు, కొంత దేశభక్తి, కొంత దేశప్రతిష్ట కాపాడటం వంటి ఆలోచనల కలగూరగంపగా ఈ స్పందన వెలువడింది.

- వేదుల రామకృష్ణ

గాంధీ మహాత్ముడి పాత కళ్ళజోడు, చెప్పులు, గిన్నె, పళ్ళెం వగైరా వేలం వేయాలనుకున్న జేమ్స్ ఓటిస్ అనే పెద్దమనిషిమీద మాత్రం ఇదంతా ఏమాత్రం ప్రభావం చూపలేదు. దీనివల్ల ఎక్కువ ధర పలకవచ్చనే ఆలోచనే అతన్ని నడిపించింది. ఈ విషయంలో జేమ్స్ ఓటిస్ స్పందన హస్యాస్పదంగా ఉంది. ఈ వస్తువుల కోసం వెచ్చించ దలచుకున్న ధనాన్ని ప్రజల ఆరోగ్యం కొరకు ఖర్చు పెట్టవచ్చునని ఓ ఉచిత సలహా కూడా మన ప్రభుత్వానికి పారేశాడతను.

ఆఖరుకి మన బడా పారిశ్రామికవేత్త విజయమాల్యా వాటిని వేలంలో నిర్ధారించిన కనీస ధరకన్నా అరవై రెట్లు ధరకు కొనేశాడు. అంతటితో ఆ కలకలానికి తెర పడింది. ఈమధ్య టాటాలు బ్రిటీష్ ల్యాండ్ రోవర్ -జాగువార్ కార్ల కంపెనీని కొన్నప్పుడు, లక్ష్మీ మిట్టల్ ఫ్రెంచి ఆర్సెలర్ స్టీల్ కంపెనీని కొన్నప్పుడు, స్లమ్‌డాగ్ మిలియనీర్‌కి ఆస్కార్లు వచ్చినప్పుడు మన దేశంలో పెద్ద ఎత్తున ప్రజల స్పందన చూస్తున్నాం. మరీ ముఖ్యంగా పాలకులు, ప్రభుత్వ ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు అందరూ ప్రశంసలు కురిపించటం చూస్తున్నాం. అదే అమెరికాతో ఒప్పందం విషయానికి వచ్చేసరికి దేశ ప్రయోజనాలు గాలికి వదిలేసి ప్రభుత్వాన్నే పణంగా పెట్టి ఎలా ప్రవర్తించారో కూడా చూశాం. అంటే ఇలాంటి విషయాలలో అంశాన్ని బట్టి మంచి చెడ్డలు బేరీజు వేసుకుని జాతి ప్రయోజనాల ఆధారంగా ఆరోగ్యకరమైన పద్ధతిలో కాకుండా ఒక ఊపుకు కొట్టుకుపోయే విధంగా స్పందన ఉంటోంది. దీన్నుండి బయట పడాల్సిన అవసరం మనందరికి ఎంతైనా ఉంది.

ఇహ మళ్లీ మహాత్మాగాంధీ వస్తువులు వేలం వ్యవహారంలో తలత్తైన విషయాలకొద్దాం. మన దేశం నుండి బ్రిటీష్ పాలనాకాలం నుంచేకాక అంతకు ముందు నుండి విలువైన వస్తువులు బయటకు పోతూనే వున్నాయి. మహమ్మద్ ఘోరీ, నాదిర్‌షా దండయాత్రలు, లూటీలు తెలిసినవే. కోహినూర్ వజ్రం మొదలుకొని బహుఅమూల్యమైన ఎన్నో వస్తువులు తరలిపోయాయి. విదేశీ పాలకులు, బానిస దేశాల సంపదలు కొల్లగొట్టడం పరిపాటే. వ్యాపార దృష్టితో చేసిన వాటికి తరవాత కాలంలో పురాతత్వ విలువలుండవు. ఉదాహరణకు పశ్చిమాఫ్రికా నుండి ఫ్రెంచివారు యురేనియం నిల్వలు తరలించుకు పోవటం అలాంటిదే. ఇకపోతే భారత భూఖండం అంతటా శతాబ్దాల తరబడి మందిరాలు, ఇతర కట్టడాలు వాటిలో విగ్రహాలు, వస్తువులు అనేకం లెక్కకు మించి ఉన్నాయి. ఇవి స్వాతంత్ర్యం వచ్చిన తరవాత కూడా దొంగిలించటం తస్కరించటం జరగుతూనే ఉంది. ఇలా దొంగిలించినవి విదేశాల్లో అమ్ముడు పోవటం, బహిరంగంగా వేలం వేయటం జరుగుతూనే ఉంది. బ్రిటన్‌లో లండన్ నగరంలో సోత్‌బీ వలేం సంస్థ ప్రపంచంలోనే పేరు గాంచింది. అక్కడ ఇటువంటి తరలిపోయిన వస్తువుల వేలం జరుగుతూనే ఉంది.

ఇలాంటి విషయాల్లో చాలా అరుదుగానే భారత రాయబారులు కలుగుచేసుకుంటారు. న్యాయ పోరాటం జరిపి నిర్దిష్టమైన వస్తువుని స్వదేశానికి రప్పించగలిగారు. ఎక్కువ సందర్భాల్లో చేయగల్గినదేమీ లేదు. పకడ్బందీగా వస్తువులను దొంగిలించటం తరువాత ఏదోఒక ఐరోపా దేశానికి తరలించటం... అక్కడి నుండి లండన్‌కి పంపించి అక్కడ వేలం వేయించటం వంటి సుదీర్ఘమైన ప్రక్రియే దానికి కారణం. అంతర్జాతీయంగా ఇలాంటి వ్యవహారాలు పరిష్కారం చేయటానికి తగు న్యాయపరమైన నిబంధనలు లేవు. యునెస్కో, యానిడ్రాయిట్ అనే రెండు కన్వెన్షన్లు ఉన్నా అవి కూడా చాలా మట్టుకు ఇరుదేశాల చట్టాల మీదే ఆధారపడి ఉన్నాయి.

విదేశాల్లోనూ ఇదే తంతు...

ఇతర దేశాల చరిత్ర చూసినా ఇలాంటి



సంఘటనలు మనకు చాలా కనిపిస్తాయి. గ్రీస్ దేశపు పార్థెనన్ పట్టణం శిల్పాలను లార్డ్ ఎల్గిన్ 1816లో తీసి బ్రిటీష్ ప్రభుత్వానికి అమ్మేశాడు. గ్రీస్ వాళ్ళు 1833 నుండి ఇప్పటి వరకు ఆ శిల్పాల్ని వెనక్కు ఇవ్వమని అడుగుతూనే ఉన్నారు. కాని ఫలితం శూన్యం. గ్రీసువారు ఈ పాలరాతి శిల్పాల్ని వారి జాతీయ వారసత్వంగా భావిస్తారు. కాని బ్రిటీష్ ప్రభుత్వం, మ్యూజియం యాజమాన్య హక్కుని నిరాకరిస్తోంది. అలాగే ఈజిప్టులో రోజెట్టా శిల్పాన్ని ఫ్రెంచివారు తీసుకుపోయారు. తరువాతి కాలంలో దాన్ని బ్రిటీష్‌వారు చేజిక్కించుకున్నారు. ఇప్పుడు అది బ్రిటీష్ మ్యూజియంలో విరాజిల్లుతోంది. ఈజిప్టు ప్రభుత్వం 2003వ సంవత్సరం నుండి దీన్ని వెనక్కి ఇవ్వమని బ్రిటీష్ ప్రభుత్వాన్ని కోరుతోంది. కొద్దికాలం పాటు అద్దెకు ఇవ్వమన్న వారి అభ్యర్థన నుండి బ్రిటీష్ - ఫ్రెంచి సైన్యాలు 1860లో కంచు విగ్రహాలను తరలించాయి. అవి ఫ్రాన్సులో వేలం వేసినప్పుడు చైనా ప్రభుత్వం నిరసన తెలియజేసినా అది ఆగలేదు. ప్యారి నగరంలో న్యాయస్థానం కూడా ఆ వేలం ఆపలేదు.

మన దేశంలో జయపూర్‌కి చెందిన వామన్ ఘియా ఉదంతం పురావస్తువుల తస్కరింపు తీవ్రతను తెలియజేస్తుంది. ఆయన పేరుకు హస్త శిల్పాల వ్యాపారి. వాస్తవానికి పురావస్తువుల అక్రమ రవాణాదారుడు. దొంగలు, మధ్య వర్తులు దేశం నలుమూలల నుండి ప్రాచీన వస్తువులను భద్రత లేని దేవాలయాలు, మ్యూజియమ్ నుండి ఘియా కొరకు దొంగలించేవారు. ఇతర చట్టబద్ధ హస్తకళా వస్తువులతో పాటు ఈ దొంగ పురా శిల్పాలను కూడా ఇతర దేశాలకు తరలించబడేవి. అక్కడ వేలం సంస్థలకు చేరి వాటిద్వారా మ్యూజియంలకు వ్యక్తిగత సంపదలతో చేరేవి. 2003లో ఒక ఏడాది పాటు నిఘా వేశాకే పోలీసులు ఘియాని నిర్బంధించారు. 2007లో ప్యాట్రిక్ కీఫ్ అనే విలేకరి 'ది న్యూయార్కర్' పత్రికలో చోరీకి గురైన ప్రాచీన తైల చిత్రాలు, కత్తులు, డాలులు, పాలరాతి ఫలకాలు, రాతి స్తంభాలు, 348 శిల్పాలు, మొగల్‌కాలం నాటి ఒక చిన్న ఇంటి నమూనా వంటి వస్తువులు పోలీసు దర్యాప్తులో ఎలా వెలుగులోకి వచ్చాయో రాశాడు.

ఖచ్చితమైన గణాంకాలు లేకపోయినా పురావస్తువుల వ్యాపారం ప్రపంచవ్యాప్తంగా వేలకోట్ల డాలర్లలో ఉంటుందని అంచనా. జరుగుతున్న వ్యాపారంలో ఎక్కువ భాగం సందేహాస్పదమైనదేనని దర్యాప్తులలో వెల్లడైంది. ఇంటర్‌పోల్ ప్రకారం అక్రమ ఆయుధాలు, మాదక ద్రవ్యాల రవాణాకు ఈ పురావస్తువుల అక్రమ రవాణా ఏ మాత్రం తీసిపోదు.





ఇంటర్‌పోల్ వెబ్‌సైట్ ప్రకారం గత రెండు నెలల్లో 431 కళాఖండాలు దొంగతనం అయ్యాయి. ప్రతి ఆరు నెలలకొకసారి దొంగలించబడిన ఆరు అతి విలువైన కళారూపాల జాబితాను అది ప్రచురిస్తుంది. డిసెంబర్ 2008లో విడుదల చేసిన జాబితాలో భారతీయ పురాతత్వ ఖనన ప్రదేశం నుండి దొంగిలించబడిన ఒక రాతి శిలా విగ్రహం ఉంది.

1982లో ఉప్పు అందుకున్న లండన్‌లో భారత రాయబారి కార్యాలయం పోలీసులను అప్రమత్తం చేసి బ్రిటీష్ మ్యూజియంలో వున్న పాథుర్ నటరాజ కంచు విగ్రహాన్ని జప్తు చేయించింది. ఆవిగ్రహం తమిళనాడులో ఒక మందిరం నుండి దొంగిలించి ఒక పురావస్తు వ్యాపారికి 1977 లో అమ్మారు. బ్రిటీష్ మ్యూజియంలో ఒక సంరక్షకురాలి వ్యక్తిగత చొరవతో దాన్ని పట్టుకున్నారు. అయితే మ్యూజియం దానిపై భారతదేశ హక్కును నిరాకరించింది. విగ్రహానికి పట్టిన చెదను పరీక్షించటానికి క్రిముల శాస్త్రవేత్తలను కూడా రప్పించారు. సుదీర్ఘ న్యాయ పోరాటం అనంతరం ఈ వివాదంలో భారత్‌కి అనుకూలంగా తీర్పు వచ్చింది.

1950 దశకంలో దొంగిలించబడిన శివపురం కంచు నటరాజ విగ్రహం కథ కూడా ఇలాంటి చిరాకైనదే. అమెరికాకు చెందిన నార్టన్ సైమిన్ ఫౌండేషన్ వారు దీన్ని కొన్నారు. 1973లో న్యూయార్క్‌లో మెట్రోపోలిటన్ మ్యూజియంలో దీన్ని ప్రదర్శించాలనుకున్నారు. భారత ప్రభుత్వం కలగచేసుకొని న్యాయపరమైన చర్యకు పూనుకుంది. న్యాయస్థానం వెలుపల కుదిరిన ఒప్పందం ప్రకారం సైమిన్ ఫౌండేషన్ విగ్రహాన్ని పదేళ్ళపాటు ప్రదర్శించి వెనక్కి ఇచ్చేయటానికి అంగీకరించింది. బదులుగా సైమిన్ ఫౌండేషన్ మాత్రం మిగిలిన భారత పురావస్తువులను అట్టి పెట్టుకోగలిగింది.

ప్రస్తుతకాలంలో గల్లంతైన వస్తువులను తిరిగి తెచ్చుకోవటమే ఇంత కష్టమైతే వలసకాలంనాడు పోయిన వస్తువులను తెచ్చుకోవడం ఇంకెంత కష్టమో చెప్పనక్కర్లేదు. అసలు ఇలాంటి వస్తువులు మళ్లీ తిరిగి మూల దేశాలకు ఇవ్వనక్కర్లేదనే వాదన పాశ్చాత్య దేశాలలో పెద్ద ఎత్తున బయల్దేరింది. అమెరికాలో హార్వర్డ్ విశ్వవిద్యాలయ మ్యూజియం సంచాలకులు జేమ్స్ క్యూనో అతి విలువైన కళా ఖండాలు ప్రపంచం మొత్తానికి చెందుతాయి తప్ప వాటి మూల దేశాలకే పరిమితం కాదని వాదిస్తాడు. పురాతత్వ వారసత్వ పరిరక్షణ దృష్ట్యా వాటిని పాశ్చాత్య మ్యూజియంలలోనే వుంచాలంటారు. అక్కడే వాటికి సరియైన భద్రత, సంరక్షణ లభిస్తాయి. 'పురాతత్వ వస్తువులు ఎవరి సొత్తు?' అన్న తన పుస్తకంలో కొత్తగా ఉద్భవించిన దేశాలు ఒకప్పుడు లేవు కనక, ఆయా ప్రాంతాలకు చెందిన వస్తువులను వారికి తిరిగి ఇవ్వనక్కరలేదని వాదిస్తాడాయన. అంటే వలసకాలపు లూటీ వారి చారిత్రక హక్కు. దాన్ని మార్చే అవసరం లేదన్నది అతని వాదన. ఇలాంటి వలస పాలన సైద్ధాంతిక కొనసాగింపు వల్ల ఇటువంటి కళాఖండాలు తిరిగి దక్కించుకోవటం చాలా కష్టతరమవుతోంది.

అంటే విక్టోరియా అండ్ ఆల్బర్ట్ మ్యూజియంలో వున్న మొగల్ చక్రవర్తుల మధిర పాత్రలు, అలాగే బ్రిటీష్ మ్యూజియంలో వున్న అమరావతి స్ఫటిక శిల్ప ఖండాలు తిరిగి రావటం కల్లే. మళ్లీ గాంధీజీ వస్తువుల దగ్గరకే వద్దాం. గాంధీ వాడిన ప్రతి వస్తువు మనదేశంలోనే ఉండి తీరాలనుకోవటాన్ని పక్కన పెడదాం. అసలు ఇంతింత ధనం వెచ్చించి వాటిని కొనాలనే ఆలోచనకు స్వస్తి చెబుదాం. దేశంలో మ్యూజియం ఆలయాలు, పురాతత్వ ఖనన ప్రదేశాలకు తగిన భద్రత, ఆర్థిక సహాయం అందచేయాలి. పురావస్తువుల నిర్వహణ దక్షత పటిష్టం చేయాలి. ఇటువంటి వస్తువుల విలువ తెలిసిన భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేయాలి. మొత్తంమీద ఒక మాటలో చెప్పాలంటే పోయిన వస్తువుల గురించి అసలు పట్టించుకోవద్దని కాదు కాని ఉన్నవాటిని పోగొట్టుకోకుండా నికరమైన కట్టుదిట్టాల ఏర్పాటుపై శ్రద్ధ వహించాలి.

★

స్ఫూర్తి

మహాగ్రంథం



వి. శ్రీనివాసరావు
ప్రజాశక్తి మాజీ సంపాదకులు
సి.పి.ఐ.ఎం కేంద్ర కార్యదర్శివర్గ సభ్యులు

"యేదో విధముగా సంఘసేవ చేయనిదే ఎవడూ దాని చేత పోషించబడటానికి అర్హుడు కాదు" అన్న మాలపల్లి నవలలోని అఖరుమాటలు నా జీవితగమనానికి దారి చూపాయి. వర్గ, సమాజికోద్యమాలను-అతివాద, మితవాదాలను-అరాచక, సంఘటితోద్యమాలను- భక్తి, ప్రజా ఉద్యమాలను కలగలిపి రంగరించిన మహద్గ్రంథమిది. "జాత్యాధిక్యత అహంకారమునకు హేతువగుటచే సవర్ణులు భగవంతునకు దూరమగుచున్నారు. కడజాతి వారికి మేమెక్కువను అభిమానముండదు. గనుక వారికి ముక్తి సమీపము. సవర్ణులకు అహంకారము అజన్మసిద్ధము, కడజాతికి అనహంకారం జన్మసిద్ధము" అన్న మాటలు పరోక్షంగా భారతీయుల సామాజిక స్వభావాన్ని వెల్లడిస్తున్నాయి. దీనికి విరుగుడుగా పైజాతులు అట్టి అభిప్రాయమును ... సాధన చేసి పోగొట్టుకొనవలెనని బోధిస్తుంది. కూలిపోరాటాల ద్వారా మాలమాదిగలను సంఘటితపరచి, వారికి ఇతర కులాల్లోని పేదలను జోడించడం ద్వారా వర్గపోరాటాన్ని ఎలా ముందుకు తీసుకొని పోవచ్చో ఈ నవల హేతుబద్దంగా వివరిస్తుంది. భూ సమస్య అసమానతలకు ఎలా మూలమో దానిపై దున్నేవాడికే ఎలా హక్కుంటుందో (ఆ మాటలు నేరుగా వాడకపోయినా) వివరించే పుస్తకమిది. కులవివక్షత అంతానికి, స్వాతంత్ర్యోద్యమానికి గల అంతఃసంబంధాన్ని వివరిస్తుంది. కులం, భక్తి, ఉద్యమాలు, భూ సమస్య, రాజ్యాంగయంత్ర స్వభావం, అసమానతలు, స్త్రీ సమానత్వం, ప్రేమ, పెండ్లి, ఆచారాలు వంటి అనేక అంశాలు ఇందులో చర్చించబడ్డాయి. వీటి మధ్య ఉండే అంతఃసంబంధం, వైరుధ్యాలను కూడా ఈ నవల చర్చిస్తుంది. స్వాతంత్ర్యం సమానత్వాన్ని అందించాలని, ధనికస్వామ్యం కాకూడదని ప్రత్యామ్నాయ కార్యక్రమాన్ని సూచిస్తుందీ గ్రంథం. దాని ప్రకారం కులవివక్షతను అంతం చేయాలి. అందరికీ చదువు చెప్పాలి. దిగువతరగతుల వారికి దున్నుకోను భూమి, నివసించడానికి ఇల్లు గ్యారంటీ చేయాలి. కార్మికసంఘాలను ప్రోత్సహించాలి.దేశభాషలందే పరిపాలన సాగించాలి.... ఇత్యాది అనేక అంశాలు ఆనాడే ప్రతిపాదించారు. భవిష్యభారతానికిది మార్గనిర్దేశిగా నిలిచింది. అందువల్లనే ఇది నన్ను మిక్కిలి ఆకర్షించింది.



1974లో ఓ మారుమూల పల్లెటూళ్లో పదవ తరగతి ముగించుకొని ఇంటర్‌లో అభ్యుదయ భావాలకు కేంద్రమైన కావలి జవహర్‌భారతిలో చేరాను. అక్కడే నేను రాజకీయ ఓనమాలు దిద్దుకున్నాను. పదవ తరగతి వరకు నాకు నవలలు చదివే అలవాటు అసలే లేదు. మా స్కూల్లో చిన్నపాటి గ్రంథాలయం ఉంది. ఆ పుస్తకాలు చదివేవారిలో నేను కూడా ఒకడినే. కథలు అందునా పురాణ, జానపద కథలు, సైన్సు పుస్తకాలు మాత్రమే తీసుకుంటుండేవాడిని. మా మిత్రులు కొంతమంది పెద్దపెద్ద నవలలు (రొమాంటిక్ అనుకుంటాను) చదివేవారు. అంత పెద్ద పుస్తకాలను ఎలా చదువుతారా అనుకునేవాడిని. కాలేజీలో కూడా లైబ్రరీకి వెళ్లేవాడిని. అలా ఇంటర్ రెండో సంవత్సరంలో నా కంట పడిన నవల మాలపల్లి. అది సుమారుగా ఐదొందల పేజీలపైబడి ఉంది. అంత పెద్ద పుస్తకాన్ని చదవగలనా అన్న అనుమానం కలిగింది. అయినా అందులో అక్కడక్కడా కనపడ్డ అసక్తికరమైన విషయాలను బట్టి ఎలాగైనా చదవాలన్న పట్టుదలతో తీసుకొన్నాను. మొదట భాష కొంత కష్టమనిపించినా ఆఖరు పేజీ పూర్తి చేసేదాకా వదలబుద్ధి కాలేదు. అలా

అది నేను చదివిన తొలి తెలుగు నవల కావడమే కాక నన్ను అమితంగా ఆకర్షించిన పుస్తకం కూడా అయింది. అనేక భావాలపై నాలో సంఘర్షణ ఆరంభమైందప్పుడే. దానికి బీజమేసింది ఈ పుస్తకమేనని చెప్పవచ్చు. తర్వాత రాహుల్ సాంకృత్యాయన్ వంటి మహామేధావుల పుస్తకాలు చదవడానికి ఈ నేపథ్యం ఎంతగానో తోడ్పడింది. చదవగలనన్న ఆత్మవిశ్వాసం పెంపొందింపచేసింది. ఆ తర్వాత ఇది అనుకోకుండా నాకు డిగ్రీలో తెలుగు ఉపవాచకంగా వచ్చింది. మరోసారి సమగ్రంగా చదవడానికి అవకాశం కలిగింది.

రష్యాలో పరిణామాలు, బోల్షివిజం డార్విన్ పరిణామ సిద్ధాంతం వంటి పదాలతో కూడా అప్పుడే పరిచయమేర్పడింది. ఒక్కమాటలో చెప్పాలంటే ఈ నవల తెలుగువారి "అమ్మ" గా చెప్పుకోవచ్చు. కాకుంటే ఇందులో అమ్మకు బదులు అయ్య కథానాయకుడు అవుతారు. మాల కులస్థుల నుండి శ్రామికవర్గనాయకులు తయారవుతారు. అభ్యుదయభావాలు కలిగిన ఉన్నత కులాల యువకులు ఈ ఉద్యమానికి వెన్నంటి నిలుస్తారు. ఇదొక రకంగా భారతదేశపు ప్రత్యేక తరహా వర్గకలయిక అని చెప్పవచ్చు. నాకు స్ఫూర్తినిచ్చిన గ్రంథం ఒకదాన్ని గురించి రాయమని ప్రజాశక్తి మిత్రులడిగినప్పుడు దీన్ని మరోసారి చదివి మననం చేసుకున్నాను. అప్పటికీ ఇప్పటికీ నాలో కలిగిన భావపరిణామం కూడా అర్థమయింది. ఈ గ్రంథాన్ని చదివినకొద్దీ మరికొన్ని కొత్త ఆలోచనలకు దారి తీస్తుంది. అదే ఈ నవల ప్రత్యేకత.

గుంటూరు జిల్లా నేపథ్యంగా సాగిన ఈ నవలలో వైవిధ్య భరిత పాత్రలున్నాయి. మొదట నుండీ చివర వరకు ఉండేది రామదాసు, రామానాయుడి పాత్రలు. ఇందులో మొదటి వ్యక్తి మాలదాసరి. భక్తిపరుడు. వృత్తిరీత్యా రైతు. రామానాయుడు పేరులోనే ఉంది ఆయన ఏ తరగతికి చెందినవాడో తెలుసుకోడానికి. రామదాసు కొడుకు సంగదాసు. అసలు ఉద్యమకర్త అతనే. రామానాయుడు తండ్రి చౌదరయ్య ఫ్యూడల్ భూస్వామి. తన కొడుకును చెడగొడుతున్నాడని, ఉద్యమాలు వ్యాపింపచేస్తున్నాడని, మాలమాదిగలకు కాళ్లు తెస్తున్నాడని కక్షతో అతన్ని కొట్టి చంపుతాడు. సంగదాసు తమ్ముడైన వెంకటదాసు దానితో ఆగ్రహించి మాలమాదిగల్ని రహస్యంగా కూడగట్టి తక్కెళ్ల జగ్గడనే పేరుతో ధనవంతులపై దోపిడీయుద్ధాన్ని ప్రారంభిస్తాడు. అతన్ని పట్టుకునే నెపంతో మాలమాదిగ పల్లెలపై బ్రిటీషుపోలీసులు దాడులు చేసి వారినందరినీ సెటిల్‌మెంట్లకు తరలిస్తారు. కొందరిపై కేసులు పెట్టి జైళ్లకు పంపుతారు. అలా రామదాసు కూడా చెరసాలపాలవుతాడు. రామానాయుడ్నీ జైలుకి పంపుతారు. ఉద్యమం కొరకు రామానాయుడు, ఆయన అన్నగారి ఆస్తుల్ని విరాళంగా ఇస్తారు. అదే మార్గాన్ని మరికొందరు కూడా అనుసరిస్తారు. స్వాతంత్ర్యానంతరమే అందరూ జైళ్ల నుండి విడుదలై ఆ గ్రామాన్ని నందనవనంగా మార్చే ప్రయత్నం చేస్తారు. అగ్రవర్ణాలు, మాలపల్లె మధ్య తపోవనాన్ని కట్టి దాన్నొక ఆదర్శగ్రామంగా తీర్చిదిద్దుతారు. ఇది సంగ్రహంగా కథ. ఇందులో వివిధ రకాల పాత్రలు నాటి సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులను కళ్లకు కట్టినట్లు చూపుతాయి. ఒక రకంగా నేను నివసించిన గ్రామానికి ఈ కథ దగ్గరగా ఉండటం కూడా నన్నీ పుస్తకం ఆకర్షించడానికి మరో కారణమై ఉంటుంది.

ఈ పుస్తకానికి తొలిపలుకు రాసిన కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు గారు దీన్ని ఆధునిక తెలుగు మహాభారతంతో పోల్చారు. ఇది నిజంగానే ఒక భారతగాథ. నిజమైన భారతం. రామదాసు వైష్ణవ భక్తుడు. ఆయన భార్య మాలక్ష్మి, కూతురు జ్యోతి. తల్లీకూతుళ్ల మధ్య దేవుళ్ల ప్రస్తావన వస్తుంది. "పెద్దవాళ్లు దేవుడి గుళ్లోకి మనలను రానిస్తారా?" అని జ్యోతి అడిగితే "రానివ్వకపోతే మీ అన్న (సంగదాసు) మనకు గుడి కట్టిస్తున్నాడుగా!" అంటుంది మాలక్ష్మి. "ఆ గుడిలోకి దేవుడొస్తాడా?" అని జ్యోతి ఎదురు ప్రశ్నిస్తుంది. ఇది ఇప్పటికీ గ్రామసీమల్లో కొనసాగుతున్న వివక్షను ఎత్తిచూపుతుంది. మాలల పొలాల్లో గడ్డిలేక గొడ్లు ఎండుతుంటే ఆసాముల పొలాల్లోకి పోయి తెచ్చుకోవచ్చా అన్న ప్రశ్నకు మాలక్ష్మి ఇచ్చిన సమాధానం ఇది. "గడ్డి ఎండిపోయినా మాబాగే కాని మాలవాండ్లు కాలు పెట్టకూడదు" అని

'నీవు వేదాంతివా?' అంటే 'వేదాలను అంతం చేసేవాడు అనే అర్థంలో అయితే అవుననే' చెపుతాడు. 'నీకు స్వర్గలోక భోగాలొద్దా?' అని కోర్టు అడిగితే "మేఘాలను నమ్మి చెరువును తెగ్గొట్టుకున్నట్లు అనుమానాస్పదమయిన పరలోకం కోసం ఇహాన్ని త్యజించవద్దు"

ఊళ్లో సాగుతున్న వివక్షతను ఎత్తి చూపిస్తుంది. దీనికి వ్యతిరేకంగా సంగదాసు నాయకత్వంలో మాలమాదిగలంతా సంఘం పెట్టుకుంటారు. ఆ మహాసభకు రామానాయుడు కూడా హాజరవుతాడు. అందులో కులగౌరవాన్ని కాపాడుకోడానికి కూడా కొన్ని తీర్మానాలు చేస్తారు. వాటిలో నీచమైన పేర్లు పెట్టుకోరాదని, ఒకరినొకరు మర్యాదగా పిలుచుకోవాలని, మద్యపానం నిలిపేయాలని, ఆరోగ్యసంరక్షణకు రోజూ స్నానం చేయాలని... ఇలా కొన్ని కట్టుబాట్లు సూచించారు. కూలి పెంచాలని, భూమి పంచాలని, ఇండ్లస్థలాలివ్వాలని, హాస్టళ్లు పెట్టాలని ఇలా పలువిధాలైన ఆర్థిక డిమాండ్లు ఆమోదిస్తారు. సామాజిక, ఆర్థికాంశాల సమ్మిళితంగా ఈ మహాసభ సాగుతుంది. "మందిసొమ్ముతో ఏర్పడిన విద్యాలయాలు, బావులు, చెరువులు, సత్రాలు, దేవాలయాల్లో దిగువతరగతి హక్కులను ఆమోదించా"లన్నది మరో ముఖ్యమైన తీర్మానం. సంగదాసు హత్యకు గురైనా తన ఆఖరి సందేశంగా "మనం గెలుస్తాం" అంటూ కొన ఊపిరి వదులుతాడు. అఖరుకు అదే నిజమవుతుంది. అందుకే ఈ నవలను 'సంగవిజయం' అని కూడా పిలుస్తారు. ఈ రెండు పేర్లలో ఏ పేరు పెట్టాలో తేల్చుకోలేక రచయిత రెండు పేర్లూ పెట్టి 'మాలపల్లి' అనేది మొదట చేరుస్తారు. అలా ఇది 'మాలపల్లి'గా ప్రాచుర్యం పొందింది.

సంపన్నులను దోచి సామాన్యులకు పంచాలనేది తక్కెళ్ల జగ్గడి సిద్ధాంతం. ఇందుకోసం కన్నం వేయడానికి 'ధర్మకన్నాలు' అని పేరు పెట్టారు. అయితే హత్యలు చేయడం, ఆడవారిని అవమానించడం, వ్యభిచరించడం, తాగడం ఇక్కడ నిషేధం. అందుకే ఇది ప్రజాదరణను చూరగొన్నది. ఒకనాడు అందరి సంపదగా ఉన్న సహజవనరులను కొందరు దోచుకొని స్వంతం చేసుకున్నారు. వాటిని మరల అయినవారికే ఇవ్వాలన్నది వీరి సిద్ధాంతం. తక్కెళ్ల జగ్గని ధర్మబోధనలుగా ప్రఖ్యాతిగాంచిన వాటిల్లో "పనివాండ్లందరు ఏకమైతిరా ప్రపంచమే మీది" అంటారు. "శ్రేణులు కట్టి సమ్మెకట్టితే చెల్లును మీ మాట, కొట్టావద్దు తిట్టావద్దు కోర్కెలు నిడివేరున్" అని పాడతారు. ఇలాంటి ధర్మసూత్రాలు, తెలుగు సూక్తులు, సామెతలకు ఇందులో కొరత లేదు. సమాజంలో ఉన్న వైరుధ్యాలపై జ్యోతి, అప్పాదాసు(జ్యోతి బావ)కు మధ్య చర్చ

జరుగుతుంది. జ్యోతి "లోకమంతా ఆనందమయం అనుకున్నాను. ఇప్పుడు దుఃఖమయమని తోస్తున్నది" అంటే అప్పాదాసు దానికి జవాబుగా "అయితే రెండో మెట్టుకు వొచ్చావు. రెంటికీ సమన్వయం కుదిరితే సత్యంలో నిలుస్తావు" అంటాడు. సుఖదుఃఖాల సంగమమే జీవితం అన్న అర్థం ఇందులో ఇమిడి ఉంది. స్వాతంత్ర్యం రానిదే ఏ సమస్యా పరిష్కారం కాదని ఒక సందర్భంలో లాయరు నారాయణరావు పాత్ర ద్వారా అనిపిస్తారు. ప్రభుత్వ విధానం ఇలాగే కొనసాగితే దేశంలో బోల్షివిజం విస్తరిస్తుందని భయమూ వ్యక్తం చేస్తాడాయన. బోల్షివిజం అంటే అప్పటికున్న అర్థం దారిదోపిడీలు చేసి పేదలకు పంచడమనే. ఆ అర్థంలోనే తక్కెళ్ల జగ్గడి పాత్రనూ చిత్రీకరిస్తారు. బోల్షివిజానికి వామరేఖగా దీన్ని చూపిస్తారు. ఉద్యమాల గురించి చర్చిస్తూ నారాయణరావుగారు రామానాయుడుతో అంటాడు "కార్మిక,పంచమోద్యమాలు రెండూ వృద్ధి చెందితేనే మనదేశంలో నిజమైన ప్రజా ప్రభుత్వం ఏర్పడుతుంది"అని. "బానిస ఎప్పుడూ తన మోక్షానికై కలహిస్తూ ఉండాల్సిందే" అంటూ పరోక్షంగా వర్గపోరాట సిద్ధాంతాన్ని ప్రతిపాదిస్తాడు రామానాయుడు. తక్కెళ్ల జగ్గడిగా ప్రచారం పొందిన వెంకటదాసు పోలీసు దాడిలో పట్టుబడి కోర్టులో ప్రవేశపెట్టినప్పుడు జడ్జితో జరిగిన చర్చ కూడా అర్థవంతంగా ఉంటుంది. అల్పసంఖ్యాకులుగా ఉన్న ధనవంతుల, అగ్రవర్ణాల పాలన పోయి జనసామాన్యం పాలన రావాలన్నదే తన లక్ష్యంగా చెపుతాడు. వారుపయోగించిన ఆధునికాయుధాలపై వివరిస్తూ పోలీసులు ఇవి రష్యా దేశం నుండి వచ్చి ఉంటాయని అనుమానం వ్యక్తం చేస్తారు. ఒకదశలో జడ్జి 'నీవు వేదాంతివా?' అంటే 'వేదాలను అంతం చేసేవాడు అనే అర్థంలో అయితే అవుననే' చెపుతాడు. 'నీకు స్వర్గలోక భోగాలొద్దా?' అని కోర్టు అడిగితే "మేఘాలను నమ్మి చెరువును తెగ్గొట్టుకున్నట్లు అనుమానాస్పదమయిన పరలోకం కోసం ఇహాన్ని త్యజించవద్దు" అంటాడు. "భాగ్యవంతులు తమ వర్తనను మార్చుకోకపోతే బీదలే చట్టాలు మార్చి లోకంలో భూతల స్వర్గం స్థాపిస్తారు" అని హెచ్చరిస్తాడు. తీర్పు చెపుతూ జడ్జి ఇలా వ్యాఖ్యానించారు. "ఇతడే ఒక పీఠాధిపతో రాజో అయితే లోకానికి మహోపకారం చేసేవాడేమో. ఈ విషయమై అతన్ని ప్రశ్నిస్తే తాను గూడా తక్కిన గురువులు,రాజులతో పాటి వాడిననే చెప్పేవారు" రాజ్యాంగయంత్ర స్వభావాన్ని అందులో వ్యక్తుల పాత్రను ఇది కళ్లకు కడుతుంది.

జైల్లో రామదాసుకు ఇతర ఖైదీలకు మధ్య కూడా అనేక రకాల చర్చలు జరుగుతాయి. మాకూ చదువుంటే అనేక సంగతులు తెలిసేవి గదాని వారు విచారిస్తారు. దానికి రామదాసు "చదువు వేరు. సద్గుణం వేరు. ఇప్పుడు మీకు తెలిసినవి ఆచరించండి" అంటారు. సిద్ధాంతానికి, ఆచరణకు మధ్య సంబంధాన్ని ఇది విశదీకరిస్తుంది. స్వాతంత్ర్యం గురించి మాట్లాడుతూ "కేవలం స్వాతంత్ర్యం సంపాదించడమే మన ప్రయత్నం కాదు. స్వరాజ్యం నిజంగా స్వర్గరాజ్యమే గావాలె" అంటారు రామదాసు. ఒక రకంగా రామదాసు పాత్రలో రచయితే ప్రవేశించినట్లు కనిపిస్తుంది ఈనవలలో. చివరలో విమోచనం గురించి రచయిత వ్యాఖ్యానిస్తూ స్త్రీ స్వాతంత్ర్యం గురించి ఇలా చెపుతారు. "ముఖ్యంగా స్త్రీలు సాహసంతో తమ పుత్రులనూ, బంధువులనూ దేశసేవకర్పించి తాము స్వయంగా శ్రమపడి కారాగృహములకు పోవడమే గాకుండా స్వరాజ్యసాధనకు ప్రథమ కారణమైన ఖద్దరునూలు వడికి వస్త్రములు నేసి స్వరాజ్య సంపాదనకు తోడ్పడ్డారు. అందుచేత స్వరాజ్య నిర్వహణంలో పాల్గొనడానికి వారికెక్కువ అర్హత గలిగింది".

ఈ పుస్తకం నేడు సులభంగా లభిస్తుంది. అయితే చదవరులకే కొరత ఉన్నట్లు కనిపిస్తుంది. దీన్ని జనబాహుళ్యంలోకి తీసుకుపోవాల్సిన బాధ్యత ఉద్యమకారులపై ఉందని నేను గాఢంగా నమ్ముతున్నా. నాడిది వ్యవహారిక భాషలోనే రాయబడ్డా నాగేశ్వరరావు పంతులు గారన్నట్లుగా ఒకనాటి వ్యవహారికమే మరోనాటికి గ్రాంథికంగా మారుతుంది. నేడు దీని పరిస్థితీ అంతే అయింది. అయినా చదవడం ఆరంభిస్తే ఆగదని మాత్రం చెప్పగలను.

★



ఆణిముత్యం

ఆధునిక తెలుగు సాహిత్యంలో ఆణిముత్యమనదగ్గ మాలపల్లి నవల రచయిత ఉన్నవ లక్ష్మీనారాయణగారు. రాసింది 1921-35 మధ్య కాలంలో. మొదటి, రెండు భాగాలు జైల్లో ఉండగా రాసి రహస్యంగా బయటకు పంపారు. వాటిని ఆనాటి బ్రిటీషు ప్రభుత్వం నిషేధించింది. 1928లో దీన్ని కొన్ని మార్పులతో ప్రచురించేందుకు అనుమతించారు. 1931లో ఆంధ్ర విశ్వవిద్యాలయం వారు దీన్ని పాఠ్యపుస్తకంగా ఎంపిక చేశారు. 1935లో మరల నిషేధానికి గురైంది. ఇలా పలుమార్లు బ్రిటీషుపాలకుల ఆగ్రహానికి గురికావడానికి ఈ నవలలో ఏముంది? అది కమ్యూనిజాన్ని వ్యాపింపచేస్తుందన్నది ప్రధాన ఆరోపణ. బోల్షివిజాన్ని బోధిస్తుందన్నది అభియోగం. 1937లో మద్రాసు రాష్ట్రంలో ఏర్పడిన తొలి కాంగ్రెసు ప్రభుత్వం దీనిపై నిషేధం ఎత్తేసింది. ఇలా నిర్బంధాల మధ్య ఈ నవల అపురూపగ్రంథంగా అవతరించింది. భారత కమ్యూనిస్టుపార్టీ ఏర్పడింది 1920లలోనే అయినప్పటికీ అధికారికంగా దేశంలో ప్రవేశించింది 1925లోనే. మన రాష్ట్రంలో 1930లదాకా దాని గురించి పెద్దగా తెలియదు. 1935 నుండే అది ప్రజల్లోకి వచ్చింది. సామాన్యులకు కమ్యూనిజం గురించి తెలియక ముందే ఆ ప్రమాదం ముంచుకొస్తుందేమోనన్న భయం బ్రిటీషువారిని ఆవహించింది. నిజానికి ఉన్నవగారు కమ్యూనిస్టుకాదు. ఫక్తు కాంగ్రెసువాది. సంస్కర్త. అయినా దూరదృష్టితో ఆలోచించగల ప్రజ్ఞాశాలి అని ఈ నవల చదివితే అర్థమవుతుంది.

గని
నవలా రచయిత
కె. చిన్నప్ప భారతి
పరిచయం



సుప్రసిద్ధ తమిళ అభ్యుదయ రచయిత కె. చిన్నప్ప భారతి నామక్కల్ ప్రాంతంలో కావేరీ పరీవాహక ప్రాంతంలోని ఓ కుగ్రామంలో మధ్యతరగతి రైతు కుటుంబంలో 1936న జన్మించారు. తన హైస్కూలు విద్యాభ్యాస కాలంలోనే ఓ కేరళ ఇంజనీరుగారి సాహచర్యంలో సామ్యవాద భావాలవైపు ఆకర్షితులయ్యారు.

దేశం స్వాతంత్ర్యం పొందిన ప్రారంభంలో చిన్నప్ప ఉన్నత విద్యా సముపార్జనకై మద్రాసు పచ్చయప్ప కళాశాలలో చేరారు. అది సుప్రసిద్ధ విద్యావేత్తలకూ, సాహితీ ప్రతిభావంతులకూ పుట్టినిల్లు. అక్కడ ఆయన తమిళ జాతీయ కవి సుబ్రమణ్య భారతి రచనలచే అత్యంత ప్రభావితులయి, తన పేరులో 'భారతి'ని చేర్చుకుని అభ్యుదయ కవితలల్లసాగారు. తమిళనాట విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ రాష్ట్రకార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. ఇండోనేషియా రాజధాని జకార్తాలో జరిగిన ప్రపంచ విద్యార్థి సదస్సులో కూడా పాల్గొన్నారు.

తదనంతరం పార్టీ సూచనల మేరకు వివాహం చేసుకొని సేలం జిల్లాలో ఉద్యమ బాధ్యతలు చేపట్టారు. ప్రధానంగా చక్కర మిల్లుల కార్మికుల రంగంలోనూ కొల్లిమలై పర్వతప్రాంత గిరిజనుల విముక్తి ఉద్యమానికి నాయకత్వం వహించి పోలీసులు, రౌడీల దాడులకు కూడా గురయ్యారు. ఎమర్జన్సీ కాలంలో ఇందిరాగాంధీ ప్రభుత్వం వల్ల చిన్నప్పభారతికి రెండు సంవత్సరాల శ్రీకృష్ణ జన్మస్థాన ప్రాప్తికూడా కలిగింది.

తదనంతర కాలంలో ఆయన ఎక్కువ కాలం సాహితీ పఠనంలోనూ, సృజనపైనా దృష్టి నిలిపారు. రష్యన్ కవి మాయకోవస్కీ భారతి అభిమాన కవివరేణ్యుడు. ఆతడు స్వయంగా ఎన్నో కవితా సంపుటాలు, కథల సంగ్రహాలు వెలువరించారు. అయితే ఆయన ముఖ్యంగా నవలా రచనపై ఆసక్తి కనబరిచారు. ఇందులో ఆయన ప్రత్యేకత ఏమిటంటే 5 సంవత్సరాలకు ఒకే నవల రాయడం, అదీ తానెంచుకొన్న అంశానికి సంబంధించిన సమగ్ర క్షేత్ర అధ్యయనం చేసిన తర్వాతే రచించడం. అందువల్ల అరడజను నవలలే వచ్చినప్పటికీ ప్రతి నవలా తమిళ నవలా సాహిత్యంలో ప్రముఖ స్థానమలంకరించినవే. ప్రతి నవలా వర్గపోరాటంలో సమాప్తమయ్యేదే. చిన్నప్ప భారతి తన రచనలలో అట్టడుగు తమిళ ప్రజల గ్రామీణ సాంస్కృతిక జీవితానికి అద్దం పడతారు.

ఆయన పలు నవలలు తెలుగు, కన్నడ, మలయాళం, హిందీ, మరాఠీ, బెంగాలీ భాషల్లో అనువదింపబడ్డాయి. వేరే ఏ నవలా కారుడికీ ఈ గౌరవం దక్కలేదు. తెలుగులో చిన్నప్ప భారతి నవలలో 'దాహం', 'సంఘం', 'చక్కెర' ప్రజాశక్తి బుక్‌హౌస్ వెలువరించింది. మొదటి రెండు నవలలను ఈ పరిచయకర్తే అనువదించారు.

ప్రస్తుత నవల 'గని' ని చినప్ప భారతి కొన్ని మాసాలు ఆసన్‌సోల్, రాణిగంజ్‌లోని బొగ్గుగనుల ప్రాంతాలలోనే నివసించి, బొగ్గు బావుల్లోకి దిగివెళ్లి అక్కడి పరిస్థితులను గంభీరంగా పరిశీలించి కరుణాత్మకంగా చిత్రించినా చివరలో వర్గపోరాట సందేశాన్నివ్వటం మరవలేదు.

- ఎ.జి. యతిరాజులు

కోడిపుంజు-3

బీర్బల్ కథలు

సుడోకు చేస్తారా?

హాలో బుజ్జాయిలూ...మీరు లెక్కలు బాగా చేస్తారు కదా. కిందున్న సుడోకు పజిల్‌ను చకచకా చేయండి. మీరు ఏంచేయాలంటే దానిలో నిలువుగా, అడ్డంగా గడులున్నాయిగా. వాటిలో ఒకటి నుండి తొమ్మిది వరకు అంకెలు వేయండి . అయితే ప్రతి వరుసలోనూ ఒక అంకెను ఒక సారి మాత్రమే వాడాలి. తర్వాత మా జవాబుతో సరి చూసుకోండి.

8	7	9	4	1	6	5		
6	3	2			8	1	4	9
		1	3	2	9	6	7	8
3	4	6	7	8	1			5
5	1	7		9		8	6	4
9			6	4	5	7	1	3
2	6	5	1	3	4	9		
1	8	3	9			4	2	6
		4	8	6	2	3	5	1

కనిపెట్టండి

హాలో ఫ్రెండ్స్...ఈ బొమ్మని చూశారుగా. ఏమనిపిస్తోంది. ఏంటీ వింత జంతువు? అనుకుంటున్నారా. నిజమే. అయితే రెండు జంతువులు, రెండు పక్షుల అవయవాల కలయికతో ఏర్పడిన జీవి ఇది. ఆ జంతువులు, పక్షులు ఏవో కనిపెట్టండి.

పిల్లిబొమ్మ గీద్దామా...



జవాబులు

ఎన్నున్నాయో? : 25

తేడాలేంటో...: గోడకు వేలాడే స్కేల్ పొడవు, టేబుల్ సొరుగు హ్యాండిల్, అబ్బాయి ప్యాంట్ జేబు, అబ్బాయి టోపీ, అబ్బాయి చొక్కా ముందు భాగం, బల్బు.

అవి ఏవి? : నీటి పాము, కప్ప, ఉడుత, కొండ చిలువ.

కనిపెట్టండి : కుక్క, గుర్రం, గుడ్లగూబ, గద్ద

సుడోకు చేస్తారా? :

8	7	9	4	1	6	5	3	2
6	3	2	5	7	8	1	4	9
4	5	1	3	2	9	6	7	8
3	4	6	7	8	1	2	9	5
5	1	7	2	9	3	8	6	4
9	2	8	6	4	5	7	1	3
2	6	5	1	3	4	9	8	7
1	8	3	9	5	7	4	2	6
7	9	4	8	6	2	3	5	1

ఆరు తేడాలేంటో...





అవి ఏవి?

హాలో బుజ్జాయిలూ...! ఈ పార్కులో కొన్ని జంతువులున్నాయి. వాటిలో కొన్ని ఉభయ చరాలు. ఉభయ చరాలంటే తెలుసుగా. నీటిలో, నేలమీదా రెండు ప్రదేశాల్లోనూ ఉండగలవు. ఇంతకీ ఇక్కడ ఉన్న నాలుగు జంతువులేవో చెప్పండే.

పదాలు ఎక్కడ?

y	t	w	p	l	p	o	s	s	u	m	f
d	i	n	g	o	y	a	p	q	m	e	d
a	g	a	w	o	m	b	a	t	l	h	b
f	k	n	k	a	v	i	l	i	s	j	a
w	a	d	r	g	e	p	d	u	a	v	n
b	n	i	c	t	h	o	p	y	l	o	d
n	g	h	w	u	c	y	p	e	a	d	i
e	a	c	e	o	t	m	m	k	o	o	c
s	r	e	r	a	q	u	r	k	k	o	o
o	o	c	l	t	y	f	k	s	r	k	o
u	o	p	w	a	l	l	a	b	y	r	t
e	m	a	r	r	u	b	a	k	o	o	k

bandicoot
dingo
emu
koala
platypus
wallaby

crocodile
echidna
kangaroo
kookaburra
possum
wombat

పిల్లలూ... ఇక్కడ కొన్ని ఆస్ట్రేలియా పదాలు ఉన్నాయి. ఇవి పైనున్న బాక్సులో అడ్డంగా నిలువుగా ఎలాగైనా ఉండొచ్చు. ఆ పదాలు కనిపెట్టి వాటిచుట్టూ సున్నా చుట్టండి.

ఎన్నున్నాయో...

హాయ్ ఫ్రెండ్స్.... ఇక్కడ 2009 అనే అంకె బోలెడు సార్లు వచ్చింది. మొత్తం ఎన్నిసార్లు 2009 వచ్చిందో చెప్పగలరా?



అట్టమీది కథ



ఆయారాం.. గయారాం...

చలికాలంలో వెచ్చదనం, వేసవిలో చల్లదనం గురించి ప్రత్యేకంగా ఆలోచించకుండానే మనసు అటువైపు లాగుతుంది. మరి ఇది ఎన్నికల సమయం కదా ఆయారామ్, గయారామ్‌ల గురించి ఆలోచించకుండా ఎలా ఉంటాం చెప్పండి. మన రాష్ట్రంలోని వివిధ పార్టీల నుంచి ఎంత మంది ఏ పార్టీల్లోకి ఫిరాయించారో, ఇంకా ఫిరాయించేందుకు ఆలోచిస్తున్నారో రోజూ చూస్తూనే ఉన్నారు కదా !!

ఎం. కోటేశ్వరరావు

మన తెలుగులో సింగయ్య అద్దంకి వెళ్లాడు, తిరిగి వచ్చాడు అన్న సామెత తెలుసుకదా ! ఇలాంటి పోలికలున్నదే హిందీలో ఆయారామ్ గయారామ్ అనే సామెత ఉంది. రాముడు వచ్చాడు వెళ్లిపోయాడు అన్నది అర్థం. అది ఇప్పుడు జాతీయ సామెత అయి కూర్చుంది. అందుకు మనం గయాలాల్‌కు ఎంతగానో రుణపడి ఉన్నాం. అంతే కాదండోయ్ ఈ పదం చివరకు ఆంగ్ల డిక్షనరీలోకి కూడా ఎక్కి అంతర్జాతీయ పదమై పోయింది. ఆయారామ్ గయారామ్ అంటే రాజకీయ పిల్లిమొగ్గలు వేయటం అని అర్థంగా చెప్పుకోవాల్సి వస్తున్నది. కాంగ్రెస్, తెలుగుదేశం, టిఆర్ఎస్ పార్టీల్లో సీటు రాని వారు తమ శిబిరంలోకి వచ్చేందుకు ప్రజారాజ్యం పార్టీ తలుపులు తెరుచుకొని కూర్చున్నది. కాంగ్రెస్‌లో సీటు రాని వారు తెలుగుదేశంలోకి, అక్కడ సీటురాదనుకున్న వారు కాంగ్రెస్‌లోకి ఫిరాయించేశారు.

ప్రపంచంలో పార్టీ లేదా పాలకవర్గం ప్రయోజనాలకు వ్యతిరేకంగా పార్లమెంట్‌లో మాట్లాడి సీటును కోల్పోయింది సర్ ఎడ్మండ్ బర్కె. బ్రిటన్‌లో రాజకీయ సంక్షోభం తలెత్తిన సమయంలోనే ఈ పరిణామం జరిగింది. మన దేశంలో కూడా తొలిసారి కాంగ్రెస్ ఉత్తరాదిన అనేక రాష్ట్రాలలో ఓడిపోయిన 1967లోనే ఫిరాయింపులు భారీగా జరిగాయి. తరువాత 1985లో కాంగ్రెస్‌కు అత్యధికంగా లోక్‌సభలో 401 సీట్లు వచ్చిన సమయంలో ఫిరాయింపులకు అవకాశం లేకుండా రాజీవ్‌గాంధీ ఫిరాయింపుల నిరోధ చట్టానికి తెరలేపారు. ఈ దేశంలో ఏం జరిగినా మావలనే అని చెప్పుకొనే కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యానికి మాయని మచ్చలుగా ఉండే ఫిరాయింపులకు కూడా అదే కారకురాలంటే ఆశ్చర్యపోనవసరం లేదు. అది స్వాతంత్ర్యానికి ముందే నాంది పలికింది.

1937లో జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ యునైటెడ్ ప్రావిన్సులో పూర్తి మెజారిటీ సంపాదించింది. దాని ముఖ్యమంత్రి గోవింద వల్లభ్‌పంత్ కొంతమంది ముస్లింలీగ్ సభ్యులను తన మంత్రివర్గంలో చేర్చుకుంటే మంచిదని భావించారు. వారిలో ఒకరైన హఫీజ్ మహమ్మద్ మంత్రిగా చేరిన తరువాత శాసనసభ్యత్వానికి రాజీనామా చేసి తిరిగి ఎన్నికయ్యారు. ఇతరులెవరూ రాజీనామా చేయలేదు. ఆంధ్ర రాష్ట్రంలో 1953లో టంగుటూరు ప్రకాశం పంతులు చేత ప్రజాసోషలిస్టు పార్టీ నుంచి ఫిరాయింపచేసి కాంగ్రెస్ ముఖ్యమంత్రి పదవిని కట్టబెట్టింది. 1967 తరువాత 1971 వరకు ప్రతి రోజూ సగటున ఇద్దరు ఎంఎల్‌ఏలు ఫిరాయించారు. పర్యవసానంగా ప్రతి నెలకు ఒక ప్రభుత్వం కూలిపోయింది. దాదాపు సగం మంది శాసనసభ్యులు ఫిరాయింపులకు పాల్పడ్డారు. 1967లో ఆయారామ్‌కు రు.ఇరవై వేలు, గయారామ్‌కు రు.నలభైవేలు ముట్టచెప్పారు. అంటే రానుపోను అరవైవేల రూపాయలు ముట్టాయి. 1967-83 సంవత్సరాల మధ్య దేశంలో పార్లమెంట్, రాష్ట్రాల అసెంబ్లీల్లో రాజకీయ ఫిరాయింపులుగా నమోదైన ఉదంతాలు దాదాపు 2,700 ఉన్నాయి. వీటిలో అత్యధికం 1,900 కేసుల్లో కాంగ్రెస్‌లోకి ఫిరాయించినవే. పదిహేను ఉదంతాల్లో ఫిరాయింపుదార్లు ముఖ్యమంత్రులయ్యారు. వీరిలో పది మంది కాంగ్రెస్ వారుగా మారారు.

ఎక్కడివారీ ఆయారామ్ గయారామ్

అనగా అనగా ఒక భారత దేశం. దానిలో కొత్తగా ఒక రాష్ట్రం హర్యానా. దానికి 1967లో తొలి ఎన్నికలు జరిగాయి. ముఖ్యమంత్రిగా రావు బీరేంద్రసింగ్



ఎన్నికయ్యారు. ఆయనకు పద్దెనిమిది మంది స్వతంత్ర సభ్యులు మద్దతు ఇచ్చారు. చాంద్‌రామ్ అనే నాయకుడు బీరేంద్రసింగ్‌పై తిరుగుబాటు ప్రకటించాడు. చాంద్‌రామ్ ముఖ్యమంత్రి అవుతాడని చెబుతూ దేవీలాల్ బలపరిచే ఎంఎల్‌ఎల కోసం గాలింపు మొదలు పెట్టాడు. అప్పుడు స్వతంత్ర సభ్యుల్లో ఒకరైన గయాలాల్ దొరికాడు. 'చాంద్‌రామ్‌ను బలపరుస్తావా?' అని అడిగారు. హర్యానాలోని పెద్ద దళిత నాయకుడైన చాంద్‌రామ్ తన నాయకుడు అని గయాలాల్ బదులిచ్చాడు. ఇది తెలిసిన రావు బీరేంద్రసింగ్ 'ఇదేమిటయ్యా గయాలాల్! ఇలా చేస్తున్నావం'టే 'అబ్బెబ్బే మీరే మా నాయకుడు, నా మాటలను మీడియా వక్రీకరించింది' అని చెప్పాడు. అదే రోజు చాంద్‌రామ్ వైపు ఫిరాయించాడు. ఒకే రోజులో మూడు స్టేట్‌మెంట్లు ఇచ్చి రికార్డు సృష్టించాడు.

గయాలాల్ నాలుగు ఐదు సంవత్సరాల క్రితం పత్రికల వారితో మాట్లాడుతూ ఆ నాటి తన అనుభవాలను పంచుకున్నాడు. తనను మీడియా తప్పుగా అర్థం చేసుకున్నదని తను చేసినదానికంటే ఎక్కువ పాపాన్ని తనకు అంటగట్టిందని అన్నాడు. చాంద్‌రామ్ తరపున దేవీలాల్ తనను అడిగినపుడు పెద్ద హరిజన నాయకుడిగా ఉన్న చాంద్‌రామ్ కూడా మా నాయకుడేనని చెప్పానని, ఆ సమయంలో అక్కడ ఉన్న రేడియో విలేఖరి స్వతంత్ర ఎంఎల్‌ఏల నాయకుడిగా తాను చాంద్‌రామ్‌కు మద్దతు ప్రకటిస్తున్నట్లు వార్తను పంపారని అన్నారు. రావు బీరేంద్ర తనను వివరణ కోరినపుడు ముఖ్యమంత్రినే శాసనసభా పక్ష నాయకుడిగా తాను గుర్తిస్తానని చెప్పారు. చాంద్‌రామ్ కేవలం హరిజన్ సమాజ్ నాయకుడు మాత్రమే అన్నారు. అప్పటినుంచి తన గురించిన అపోహను తొలగించేందుకు ప్రయత్నిస్తున్నా అని తన పేరుకు వచ్చిన కళంకాన్ని తుడిచి వేస్తున్నా అంటూ అసలు ఆరోజుల్లో నేడున్న ఫిరాయింపుల నిరోధం మాదిరి బిల్లు లేదు అన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ గుర్తు అయిన హస్తం గుర్తుతో తాను ఆనాడు ఇండిపెండెంటుగా పోటీ చేశానన్నారు. గయాలాల్ మరోసారి 1977లో జనతాపార్టీ అభ్యర్థిగా అసెంబ్లీకి ఎన్నికయ్యాడు. ఇప్పుడు ఆయన కుమారుడు ఉదయభాను ఎంఎల్‌ఏగా ఉన్నారు.



తండ్రికి తగ్గ తనయుడు

గయాలాల్ తనకు తెలియకుండానే ఫిరాయింపుల అధ్యాయానికి మారుపేరుగా మారితే ఆయన తనయుడు తండ్రికి తగ్గ తనయుడిగా పేరు తెచ్చుకొనేందుకు అదేబాటలో నడిచాడు. హర్యానాలోని హసన్‌పూర్ నుంచి స్వతంత్ర ఎంఎల్‌ఏగా గెలిచిన గయాలాల్ కుమారుడు ఉదయ భాన్ ఐఎన్ఎల్‌ఎన్‌డి నుంచి కాంగ్రెస్‌లోకి ఫిరాయించారనే ఆరోపణలను ఎదుర్కొంటున్నారు. తాను కాంగ్రెస్‌లో చేరలేదని, అసెంబ్లీలో మద్దతు మాత్రమే ప్రకటించానన్నారు.

ఫిరాయింపుల నిరోధక చట్టం

ఆయారామ్ గయారామ్‌లను ప్రోత్సహించిన కాంగ్రెస్ నానాటికీ బలహీన పడుతున్న కొద్దీ నీవు నేర్పిన విద్యయే నీరజాక్షా అన్నట్లు ముఠాలు పడి కాంగ్రెస్ నాయకులు పంచాయతీలు పెట్టుకుంటున్న పూర్వరంగంలో వాటిని అదుపు చేసేందుకు కాంగ్రెస్ నాయకత్వం ఫిరాయింపుల నిరోధ చట్టానికి శ్రీకారం చుట్టింది. రాజ్యాంగం 52వ సవరణ ద్వారా ఫిరాయింపుల నిరోధక చట్టం-1985ను పదవ షెడ్యూలులో చేర్చారు. ఇందిరాగాంధీ హత్య తరువాత జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్‌కు లోక్‌సభలో 401 మంది సభ్యులున్నారు. ఈ చట్టం ప్రకారం ఎవరైనా సభ్యుడు తనంత తానుగా ఒక రాజకీయ పార్టీకి రాజీనామా చేసినపుడు, పార్టీ నిర్ణయానికి విరుద్ధంగా ఓటు చేసినా, లేక అనుమతి లేకుండా గైర్హాజరైనా సభ్యుడిగా అనర్హులౌతారు. దీనిలో కొన్ని లోపాలున్నట్లు తరువాత వెల్లడైంది. ఈచట్టం ప్రకారం ఒక రాజకీయ పార్టీకి చెందిన సభ్యులలో మూడోవంతు మంది ఫిరాయించినపుడు వారిపై చర్య తీసుకొనే అవకాశం లేదు. దాన్నీ చీలిక లేదా మరో పార్టీలో విలీనంగా భావించవచ్చు. ఈ లోపాలను సవరించేందుకు దినేష్ గోస్వామి కమిటీని ఏర్పాటు చేశారు.జాతీయ లా కమిషన్, దినేష్ గోస్వామి కమిటీ సిఫార్సుల మేరకు రాజ్యాంగ సవరణ 91 ద్వారా సవరణ చట్టం 2003 తెచ్చారు. దీని ప్రకారం ఒక పార్టీలోని మూడింట రెండువంతుల మంది సభ్యులు విడిపోతేనే దానిని చీలికగా గుర్తిస్తారు. దీన్ని ఫిరాయింపుగా పరిగణించరు. పార్టీ విప్‌ను ధిక్కరించినట్లు ఎవరినైనా గుర్తిస్తే వారిని పార్టీనుంచి బహిష్కరించవచ్చు. అయితే చట్టసభలో సభ్యత్వం రద్దు కాదు. దానిపై విచారణ తరువాత నిర్ణయం తీసుకోవాల్సింది స్పీకరే. స్పీకర్ నిర్ణయాన్ని ఏ కోర్టులోనూ సవాలు చేయటానికి, కోర్టు విచారించటానికి అవకాశం లేదు. అయితే స్పీకర్లకు ఇచ్చిన ఈ అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్న ఉదంతాలు 2003 తరువాత అనేకం జరిగాయి. మన రాష్ట్రంలో టిఆర్ఎస్ సభ్యులను అనర్హులుగా ప్రకటించే ప్రక్రియ ఎంత ప్రహసనంగా, దీర్ఘకాలం, సభ రద్దయ్యే ముందువరకు జరిగిన విషయం తెలిసినదే. అంతకు ముందు, తరువాత కాలంలో యుపిలో స్పీకర్లు నిర్వహించిన పాత్ర వివాదాస్పదమైంది.

పాలిటిక్స్ ఎక్కడో ఫిరాయింపులూ అక్కడే

పాలిటిక్స్ ఎక్కడ ఉంటాయో అక్కడ ఫిరాయింపులు ఉంటాయి.ఆధునిక ప్రజాస్వామ్యానికి పుట్టినిల్లని చెప్పుకొనే బ్రిటన్‌లోనే పాలిటిక్స్‌తో పాటు ఫిరాయింపులు ప్రారంభమయ్యాయి కనుకనే తొలి నిరోధ చర్యగా 'విప్' జారీ చేయాల్సి వచ్చింది. విప్‌కు మూలం తొలి రోజుల్లో ఇప్పటి మాదిరి పార్టీ ఫిరాయింపులు మాత్రం కాదు. అభిప్రాయాలను మార్చుకోవటం కూడా ఫిరాయింపే కాదంటారా? పాలిటిక్స్ స్థూలంగా రెండు రకాలు. ఒకటి స్వలాభం కోసం, రెండవది ప్రజా ప్రయోజనం కోసం.అంటే పాలిటిక్స్ రెండంచుల కత్తి వంటిదన్న మాట. ఇప్పుడు

పేరుమోసిన ఫిరాయింపుదారు చర్చిల్

బ్రిటన్‌లో పేరు మోసిన పార్టీ ఫిరాయింపుదారుగా మాజీ ప్రధాని విన్‌స్టన్ చర్చిల్ చరిత్ర కెక్కారు. ఆయన తొలుత కన్సర్వేటివ్‌పార్టీ తరపున 1901లో పార్లమెంట్‌లో ప్రవేశించారు. మూడేళ్ల తరువాత లిబరల్ పార్టీకి మారారు. తిరిగి 1925లో కన్సర్వేటివ్ పార్టీలో చేరారు.

అమెరికాలో రెండు ప్రధాన పార్టీలు బలంగా ఉన్నందున ఫిరాయింపులు ఆ రెండు పార్టీల మధ్యనే జరుగుతాయి. అక్కడ 2004 తరువాత అనేక ఫిరాయింపులు జరిగాయి. అంతకు ముందు 2000 సంవత్సరంలో సెనెటర్ జేమ్స్ మెరిల్ రిపబ్లికన్ పార్టీ నుంచి ఫిరాయించి స్వతంత్రుడిగా మారారు. ఇలాంటి ఫిరాయింపులు ఎక్కువగా అమెరికా దక్షిణాది రాష్ట్రాలలో జరుగుతున్నాయి.

నికరాగువాలో లిబరల్ పార్టీ, శాండినిస్టా పార్టీలనుంచి కొందరు ఫిరాయించి గతంలో మూడో పార్టీని ఏర్పాటు చేశారు.

కెనడాలో కూడా మనదేశం మాదిరి కొందరు ఎంపీలు పార్టీలు మారటంతో కొన్ని నిరోధ చర్యలు తీసుకున్నారు. మానిటోబా రాష్ట్రంలో రెండు సంవత్సరాలలో ముగ్గురు ఎంపీలు పార్టీలు మార్చారు. దాంతో ఫిరాయించిన వారు రాజకీయపార్టీల సభ్యత్వాలకు రాజీనామా చేయాలని, మిగిలిన పదవీ కాలంలో స్వతంత్ర సభ్యులుగా పని చేయాలని నిర్ణయించారు. ఆస్ట్రేలియాలో ఒకపార్టీ 1975-82 మధ్య 19సార్లు పేరు మార్చుకొని మొత్తంగా ఫిరాయింపులకు పాల్పడింది. రికార్డు స్థాయిలో ఫిరాయించిన వారిలో టాస్మేనియన్ సెనెటర్ రినాల్డ్ చార్లెస్ రైట్ రికార్డుల కెక్కారు.నూటయాభైసార్లు తన పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా 150 సార్లు ఓటు చేశారు.

దక్షిణాఫ్రికాలో ఎవరైనా పెద్ద పార్టీ నుంచి మారాలంటే పదిశాతం సభ్యులు ఒక గ్రూపుగా ఉంటేనే చెల్లుతుంది. పదిమంది కంటే తక్కువ ఉన్న పార్టీలలో ఒక్కరు ఫిరాయించినా చెల్లుబాటు అవుతుంది.

మన 'విప్' గురించి చెప్పుకుందాం. మన పాఠశాల తరగతుల్లో పిల్లలుంటారు కదా. వారికి టీచర్లు విప్‌లను నియమిస్తారు తెలుసా?! అదేనండీ క్లాసు లీడర్లు. వాళ్ల పనేమిటి టీచర్లు లేనపుడు పిల్లలను అల్లరి చేయకుండా కాపాడటం. బయటకు పోకుండా కూర్చోబెట్టటం. పల్లెటూళ్లలో అయితే బడికి రాని వారిని తీసుకువచ్చే డ్యూటీ కూడా తరగతి లీడర్లకు వేసేవారు. టీచర్ లేనపుడు లీడర్ చెప్పింది వినాల్సిందే. లేకుంటే బోర్డుపై నంబరెక్కుతుంది. టీచర్ వచ్చిన తరువాత బెత్తానికి పని చెబుతారు.

ఇక మన అసెంబ్లీ, పార్లమెంట్ విప్‌ల విషయానికి వస్తే కొంచెం ఇంచుమించుగా తరగతి లీడర్‌ల వంటి బాధ్యతలే నిర్వహించాల్సి ఉంటుంది. అక్కడ టీచర్ తోటి పిల్లలకు సంధానకర్తగా లీడర్ ఉంటే చట్టసభల్లో పార్టీ నాయకత్వం-సభ్యుల మధ్య సంధానకర్తగా అవసరమైతే ఆర్డర్లు జారీ చేసేవారిగా విప్‌లు ఉంటారు. వారి విప్ ధిక్కరిస్తే స్పీకర్ చర్య తీసుకుంటారు. అసలీ విప్ అనే పదం ఎలా వచ్చిందబ్బా!!

విప్ అంటే కుక్కల మాస్టరా!!!

తస్సాదియ్యా బలే గమ్మత్తుగా కనుగొన్నారు. పూర్వం ఐరోపాలో నక్కల వేటగాళ్లు తమకు సహాయంగా కుక్కలను తీసుకువెళ్లే వారు. వారికి సహాయకులు ఉంటారు కదా. వారి పనేమంటే అటూ ఇటూ, వెనకా ముందుకూ లాగే కుక్కలు చెదిరి పోకుండా వాటి మెడల్లోని తాళ్ల లేదా బెల్టులను పట్టుకొని ఉండటం. అటువంటి వారిని విప్పర్ అనే వారు. కుక్కలను ఎటూ పోకుండా పట్టుకున్నట్లే చట్టసభల్లో సభ్యులకు కాపలా కాయటం,అవసరమైనపుడు సభలకు రప్పించటం, ఏదైనా అంశంపై పార్టీ విధానానికి అనుగుణంగా ఓటు చేయాలని ఆదేశం జారీచేయటం తదితర విధులను నిర్వర్తించేందుకు విప్పర్ అంటే బాగుండదు కనుక విప్ అని ఖరారు చేశారు.

విప్‌కు తొలి బలి సర్ ఎడ్మండ్ బర్కే

బ్రిటన్ పార్లమెంట్లో విప్‌కు బలైన తొలి సభ్యుడు సర్ ఎడ్మండ్ బర్కే. బ్రిటన్ పార్లమెంట్ చరిత్రలోకి వెళితే దాని తొలి మూలం 12వ శతాబ్దిలో దొరుకుతుంది. అప్పటి బ్రిటీష్ రాజు దేశంలోని ధనికులు, ఆర్చిబిషప్‌లతో కొలువు తీరినపుడు వారి మధ్య రాజకీయ చర్చలతో పాటు జనం మీద ఎలాంటి పన్నులు వేయాలి, వివాదాలు వచ్చినపుడు ఏం తీర్పులివ్వాలి అనే అంశాలు కూడా ఉండేవి. ఈ క్రమంలో సామాన్యులనుంచి వచ్చిన వీర యోధులు కూడా ప్రతి కౌంటీ నుంచి వచ్చి పాల్గొనేవారు. ఇలాంటి సమావేశాలను తొలిసారిగా 13వ శతాబ్దిలో పార్లమెంట్ సమావేశాలుగా వర్ణించారు. ఇలా సామాన్యులనుంచి వచ్చిన వీరులు, రాజప్రతినిధులు, మత ప్రతినిధులు క్రమంగా రెండు సభల ప్రతినిధులుగా మారిపోయారు.

సర్ ఎడ్మండ్ బర్కే

ఐరోపాలో వచ్చిన పారిశ్రామిక విప్లవం అనేక మార్పులను తెచ్చింది. వాటిలో ఒకటి బ్రిటీష్ పార్లమెంట్‌లో సభ్యులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేయటం. ఇది కూడా వర్గ ప్రయోజనాలకు అనుగుణంగానే జరిగింది. బ్రిటన్‌లో విప్ అనే పదం ఉనికిలోకి వచ్చిన దాదాపు వందేళ్ల తరువాత అమెరికన్ పార్లమెంట్‌లో స్పీకర్ థామస్ రీడ్ 1897లో ప్రజాప్రతినిధుల సభలో దీన్ని వినియోగించారు. జేమ్స్ ఎ టావెనీ అనే ఎంపీని విప్‌గా ప్రకటించి పార్టీ సభ్యులు ఎక్కడికీ పోకుండా చూసే బాధ్యతను అప్పచెప్పారు. డెమోక్రటిక్ పార్టీ తొలి విప్‌ను 1901లో నియమించారు. అయితే విప్‌ను 1930దశకంలో డెమోక్రాట్లు విస్తృతంగా వినియోగించారు.

సర్ ఎడ్మండ్ బర్కే ప్రజాప్రతినిధులు తాము న్యాయం అనుకున్నదానిపై నిలబడాలి తప్ప పార్టీ జారీ చేసిన ఆదేశానికి కట్టుబడి ఉండాల్సిన అవసరం లేదంటారు. అన్ని పరిస్థితుల్లో కూడా ఇష్టానుసారం ఓటు వేసే స్వేచ్ఛ ఉండాలంటారు. అసలింతకీ ఈయన ఎందుకు పార్లమెంట్ సభ్యత్వం పోగొట్టుకున్నారో కదా !

బర్కే 1765 డిసెంబరులో ప్రజాప్రతినిధుల సభకు ఎన్నికయ్యారు. ఆయన రాజుగారి పెత్తనం ఎంతమేరకు ఉండాలనే అంశంపై చర్చకు నాయకత్వం వహించారు. రాజరికానికి అపరిమిత అధికారాలు ఉండకూడదని, రాజరిక అధికార దుర్వినియోగాన్ని ఎదుర్కొనే పాత్రను రాజకీయపార్టీలు పోషించాలని వాదించాడు.ఐర్లండ్ కాథలిక్‌ల హింస, పీడనలను, ఈస్టిండియా కంపెనీ అవినీతిని వ్యతిరేకించాడు. 1772లో పోలాండ్ విభజన ఆధునిక ఐరోపా రాజకీయ వ్యవస్థకు తొలి పెద్ద గండి అని దానికి వ్యతిరేకంగా మాట్లాడాడు. తరువాత ఐరిష్ వాణిజ్యంపై ఆంక్షలను పున:పరిశీలించే తీర్మానాన్ని బలపరిచాడు. అయితే ఆయన నియోజకవర్గంలోని వ్యాపారులు ఐర్లండ్‌తో స్వేచ్ఛా వాణిజ్యాన్ని వ్యతిరేకించాలని బర్కేపై వత్తిడి తెచ్చారు. అందుకు ఆయన వ్యతిరేకించాడు. అదే విధంగా కాథలిక్కులపై ఉన్న కొన్ని ఆంక్షలను ఎత్తివేసేందుకు జరిగిన యత్నాలను సమర్ధించాడు. ఈ కారణాలతో బర్కే పార్లమెంట్ సభ్యత్వం కోల్పోయాడు. అదన్నమాట సంగతి...!

★

బొబ్బట్లు

కావలసిన వస్తువులు

పచ్చి శెనగపప్పు- 1డబ్బా,
పంచదార లేదా బెల్లం తరుగు- 1 డబ్బా
యాలుకలు - 6,
ఉప్పు - తగినంత
నెయ్యి లేదా డాల్డా లేదా నూనె - పావుకిలో
మైదా లేదా గోధుమపిండి - అరకిలో

తయారుచేయు విధానం

ముందుగా పిండిని శుభ్రంగా జల్లించుకుని పూరీ పిండిలా కొంచెం పల్చగా కలుపుకోవాలి.పిండి ముద్ద అయిన తర్వాత కాస్త నూనెతో పిండి కలిపారంటే చేతికి అంటకుండా ఉంటుంది. దీన్ని పక్కన పెట్టి శనగపప్పు శుభ్రం చేసుకుని తగినన్ని నీళ్లుపోసి మెత్తగా ఉడికించుకోవాలి. ఇవి మెత్తగా ఉడికిన తర్వాత బెల్లం లేదా పంచదార వేసి కొంచెం సేపు ఉడికించి దింపుకోవాలి. 2 నిమిషాలు ఆగి ఈ పప్పును మిక్సీలో గానీ, రోట్లోగానీ వేసి పలుకులేకుండా రుబ్బుకోవాలి. దీనిలో యాలుకలపొడి కూడా వేసి కలుపుకోవాలి. ఈ పప్పును నిమ్మకాయంత ఉండలు చేసుకుని పెట్టుకోవాలి.అలాగే పూరీ పిండిని కూడా నిమ్మకాయంత ఉండలు చేసుకుని అరిటాకు గానీ, ప్లాస్టిక్ పేపర్‌గానీ తీసుకుని దానిమీద నూనె రాసి ఈ పూరీ పిండిని పెట్టి కొంచెం పల్చగా వేళ్లతో వత్తుకోవాలి. వత్తేటప్పుడు నూనెతో వేళ్లను తడుపుకోవాలి. దీనిమీద పప్పు ఉండ పెట్టి పిండిని నలువైపుల నుండి కవర్ చేయాలి. ఇది మరలా గుండ్రంగా వస్తుంది. సాధ్యమైనంత పల్చగా పప్పు పైకి రాకుండా వత్తుకోవాలి. పొయ్యి మీద పెనం పెట్టి నూనె రాసి వత్తిపెట్టుకున్న వాటిని రెండు వైపులా నూనెవేసి దోరగా వేయించుకోవాలి. ఇవే బొబ్బట్లు. తడి తగలకుండా ఉంటే రెండు రోజులు కూడా నిల్వ ఉంటాయి. వీటిని వేడిగా ఉన్నప్పుడు నెయ్యితో, చల్లగా ఉన్నప్పుడు వేడి పాలతో తింటే స్వర్గానికి అంగుళం దూరంలో ఉన్నట్టే.


బొబ్బట్లు


చెకోడీలు

చెకోడీలు

కావలసిన పదార్థాలు

బియ్యం పిండి - అరకిలో
పెసరపప్పు లేక శనగపప్పు - పావుకిలో
తినేషోడా - చిటికెడు, కారం - సరిపడా
ఉప్పు - తగినంత, నూనె - అరకిలో

తయారు చేయు విధానం

పెసరపప్పు ముందుగా బాగా నానబెట్టుకోవాలి. తర్వాత బియ్యం పిండిలో నానిన పెసరపప్పు, తినే షోడా, కారం, ఉప్పు వేసి కలపాలి. తర్వాత కొంచెం నూనెని మరగబెట్టి పిండిలో వేసి బాగా కలియబెట్టాలి. తర్వాత నీళ్లతో ముద్దగా కలుపుకొని అరగంట నాననివ్వాలి. తర్వాత గోలీకాయంత పిండిని తీసుకుని అరచేతిలో వేసుకుని రెండుచేతి వేళ్లతో దానిని తీగలాగా పొడవుగా సన్నగా చేసి రెండు చివర్లు కలిపి గుండ్రంగా చేసి పక్కన పెట్టుకోవాలి. లేదా కారప్పూస గిద్దల్లో ఒక్క బెజ్జం ఉన్న బిళ్ల ఉంటుంది. దానిలో పిండినిపెట్టి పీటమీద పొడవుగా వత్తుకొని చిన్న ముక్కలుగా కట్ చేసుకుని వాటిని గుండ్రంగా అతికించుకోవచ్చు. బాండీలో నూనె పోసి కాగిన తర్వాత గుండ్రంగా చేసుకున్న వాటిని నూనెలో వేసి దోరగా వేయించుకుంటే బావుంటాయి. వీటిని చల్లారాక డబ్బాలో వేసుకోవాలి.



కొబ్బరి అన్నం

కావలసిన పదార్థాలు

పలావు బియ్యం - కిలో, కొబ్బరికాయ - 1
పచ్చిమిర్చి - 8, నూనె - అరకప్పు, జీడిపప్పు - 10, యాలకులు - 5, అల్లం - అరంగుళం ముక్క, మసాలాఆకు - 5గ్రాములు, పొదినా - 5 రెమ్మలు, ఉప్పు - తగినంత, బఠాణీ గింజలు - పావు కప్పు, ఉల్లిపాయలు - 2, నెయ్యి - అరకప్పు, లవంగాలు -5, దాల్చిన చెక్క - కొంచెం, వెల్లుల్లిపాయ - 1, కొత్తిమీర - 10 రెమ్మలు.

తయారుచేయు విధానం

బియ్యం శుభ్రంగా కడిగి నీళ్లు లేకుండా వంచుకోవాలి. అల్లం వెల్లుల్లి నూరి పెట్టుకోవాలి.ఎండు బఠాణీ అయితే నానపెట్టుకోవాలి. పచ్చివైతే అలాగే వేసుకోవచ్చు.ఉల్లిపాయ, పచ్చి మిర్చి పొడవు ముక్కలుగా కోసి పెట్టుకోవాలి. పచ్చి కొబ్బరి తురుముకుని దానితో కొబ్బరి పాలు చేసుకోవాలి. కిలో బియ్యానికి కొబ్బరి పాలు, నీళ్లు కలిపి ఒకటిన్నర లీటరు పోసుకోవాలి. స్టౌ మీద గిన్నె పెట్టి నూనె వేసి కాగిన తర్వాత ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి ముక్కలు, మసాలా దినుసులు అన్నీ కాగిన నూనెలో వేయించాలి.కడిగి ఉంచుకున్న బియ్యం అందులోనే వేసి కొబ్బరి పాలు, నీళ్లు , సరిపడా ఉప్పు వేసి మూత పెట్టాలి. అన్నం ఒక పొంగు వచ్చిన తర్వాత అందులో సన్నగా తరిగిన పుదినా, కొత్తిమీర వేసి సన్నని సెగమీద పెట్టుకోవాలి. ఐదు నిమిషాల తర్వాత స్టౌ మీదనుండి దింపుకోవాలి. వేడి వేడి కొబ్బరన్నం రెడీ.

కొబ్బరి అన్నం


సొరకాయ నువ్వుల పొడి కూర

సొరకాయ నువ్వుల పొడి కూర

కావలసిన పదార్థాలు

సొరకాయ - చిన్న కాయ, ఉల్లిపాయ - చిన్నది
నువ్వులు - ఒక కప్పు, ఉప్పు - తగినంత
జీలకర్ర - రెండు టీ స్పూన్లు,
ఎండు మిరపకాయలు - 5
నూనె - తాలింపుకు సరిపడా,
పోపు సామాను - 2 టీ స్పూన్లు,
కరివేపాకు - 2 రెబ్బలు

తయారు చేయు విధానం

ముందుగా సొరకాయ పెచ్చుతీసి కడిగి ముక్కలు కోసి పెట్టుకోవాలి. ఉల్లిపాయలు చిన్న ముక్కలుగా కోసిపెట్టుకోవాలి. నువ్వులు, ఎండు మిరపకాయలు దోరగా వేయించి పెట్టుకోవాలి. వేయించుకున్న నువ్వులు, ఎండు మిరపకాయల్లో జీలకర్ర, ఉప్పు, కరివేపాకు వేసి దంచి పెట్టుకోవాలి.బాండీలో నూనె వేసి కాగిన తర్వాత పోపువేసి దానిలో ఉల్లి ముక్కలు వేసి వేగిన తర్వాత సొరకాయ ముక్కలు వేయాలి. 5 నిమిషాల తర్వాత దంచి పెట్టుకున్న పొడిని వేసి కలియబెడుతూ వేయించుకోవాలి.

★

కథ

స్పందించని సమాజం

శీలం అశోక వర్ధన్ రావు

ఆరోజు రోడ్డంతా కళకళలాడుతూ కొత్తగా కనిపించింది. అప్పిగాడికి రోడ్డుమీద తెల్లగా బారులుదీరి ఏదో ఆవేశంగా కేకలు వేసుకుంటూ వెళు తున్నారు స్కూలు పిల్లలు. ఎక్కడినుంచో జేజేలు వినిపిస్తున్నాయి. ఎక్కడ చూసినా జనమంతా కొత్త బట్టలతో ఉత్సాహంగా తిరుగుతున్నారు. రాజకీయ నాయకులు కాబోలు తప్పనిసరై కార్లలో వెళుతున్నారు. ఆకాశం కనిపించకుండా రంగు రంగుల కాగితాలతో నింపారు. దూరంగా గుంపు కనిపించింది అప్పిగాడికి. వింతగా అనిపించి దగ్గరగా వెళ్ళాడు. ఎవరో తెల్లటి బట్టలు ధరించిన పెద్దమనిషి జెండా ఎగరేస్తున్నాడు. వరుసలలో నిలబడ్డ ప్రజానీకం అంతా ఏదో పాట పాడుతూ దేశం నలుమూలలా ప్రతిధ్వనించేటట్లు అరుస్తున్నారు. అలా ఎంత దూరం వెళ్లినా రంగుల జెండాలే కనిపిస్తున్నాయి అప్పిగాడికి. ఎక్కడ చూసినా జెండాలు ఎగుర వేయటం, చప్పట్లూ ఇంకా ఏవో కేకలు వినిపిస్తూనే వున్నాయి. కొంతమంది బడా మనుషులు దేవుడిచ్చిన నోరు కదాని వృథా చేయకుండా ప్రసంగిస్తూనే వున్నారు.

'ఈ రోజు జనాలకేమైనా పిచ్చి లేచిందేమో! నాకెందుకులే అనుకొని రెండు బజార్లు తిరిగి దాహం వేస్తుంటే భుజం మీది గోనె సంచి, చేతిలోవున్న కట్టె అక్కడ పడేసి బోరింగు దగ్గరకెళ్లి నాలుగు బాదులు బాదాడు. పాపం! గవర్నమెంటోళ్ళు వేసిన బోరుబావి కదా! ఎంత బాదినా వాడికి చెమట చుక్కలు మాత్రం రాలాయికాని బోరింగులోంచి ఒక్క నీటి బొట్టు మాత్రం రాలేదు.

నిరాశతో నిస్సత్తువతో వేళాడుతున్న ఒంటిని బిగబట్టి గోనె సంచిని మళ్ళా భుజాన వేసుకొని వెనక్కు ఓసారి చూసుకున్నాడు. విశ్వాసంలేని మానవజాతిని ద్వేషిస్తూ ఆ మూగజీవులు మాత్రం నీరసంగా అతణ్ణి అనుసరిస్తూనే వున్నాయి. తన భాషతో వాటికి ఏదో సర్దిచెప్పుకొని బయలుదేరాడు. కళ్ళు తమ కర్తవ్యాన్ని అవి నిర్వర్తిస్తూనే వున్నాయి నీరసంగా.

దూరంగా పెద్ద చెత్తకుండీ కనిపించింది. అప్పిగాడి కళ్ళు చెమర్చాయి. కుండీ నిండా కాగితాలే. "పొద్దుగాల లేసి ఎవని మొకం సూశానో?" అనుకున్నాడు. కట్టెతో కెలికాడు. అక్కడే గోనెసంచి నిండిపోయింది. చిన్న సంచిని కూడా నింపుకున్నాడు. ఈ రోజెందుకో లక్షలు సంపాదించినంత సంబరంగా వుంది అప్పిగాడికి. "ఇయ్యాల మాలెక్కువ ఉంది. కొన్ని పైసలు ఎక్కువ అడుక్కోవాలి సేఠ్‌ని" అనుకున్నాడు.

దుకాణమంతా గిరాకోళ్ళతో కిట కిట లాడిపోతోంది.

"సేఠ్ మాలు జల్దీ తీస్కో" అప్పిగాడి తొందర.

"నీకంత జల్దైతే వేరె దుకణం సూస్కోరా!" రంగరాజు బెదిరింపు ఈ దుకాణం విడిచి ఎక్కడికీ వెళ్ళడన్న ధీమాతో. మళ్ళీ అప్పిగాడి తొందర.

బిజీగావున్న రంగరాజు అప్పిగాడి మాట వినిపించుకోలేదు ఈసారి. అర్ధగంట తర్వాతగాని అప్పిగాడికి వీలుదొరకలేదు.

"ఏరా అప్పిగా, ఈయాల మాలు బాగ్గొట్టావే!"

"అవును దొరా" అప్పిగాడి సమాధానం.

"ఇగోరా మాలుకి పది రూపాయలు, ఇగో ఈ ఐదు పండగ మామూలు.

"ఏం పండగ దొరా? అమాయకంగా అడిగాడు అప్పిగాడు.

"పిచ్చోడా! నీకింకా తెల్వదా? ఇయ్యాల స్వాతంత్ర దినోత్సవం. అదేదో గొప్పోళ్ళ పండుగ" అనుకున్నాడు అప్పిగాడు.

"అదేరా ఆగస్టు పదిహేను, గాంధీగారు, సీతామరామరాజు గారు, చంద్రబోసుగారు ఇంకా.... గుర్తుకాక నెత్తిగొక్కుంటూ ఈల్లందరూ కలిసి స్వాతంత్ర్యం....అదేరా పిచ్చోడ. మనదేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన రోజురా" చెప్పుకుపోతున్నాడు రంగరాజు ఆ స్వాతంత్ర్యం ఏదో తానే తీసుకొచ్చినట్లు మీసం మెలేస్తూ.

ఏదో కథ వింటున్నట్టుగా అనిపించింది అప్పిగాడికి. రంగరాజు ఇంకా చెప్పుకుంటూ పోతూనేవున్నాడు. అప్పిగాడు మాత్రం అదేదీ పట్టనట్లుగా గోనెసంచి చంకన బెట్టుకొని బయలుదేరుతూ వెనక్కు చూసుకున్నాడు. తన శునక బలగం కూడా సంతోషంగానే కనిపించింది. వాడి అంతరాత్మలోని ఏదో తెలియని అనురాగం ఇంటివైపే లాగుతోంది. సేఠ్ ఇచ్చిన నోట్లని మళ్ళీ మళ్ళీ లెక్కేసుకుంటూ నడుస్తున్నాడు. ఇపుడు వాడి చూపు చెత్తకుండీ వైపు పోవడంలేదు. ఈ సంతోషాన్ని తన సుబ్బితో పంచుకోవాలనే తాపత్రయం వాణ్ణి ఇంటి వైపే లాగుతోంది.

"ఇయ్యాల పండగంట. తొందరగా రా మావా" సుబ్బి మాటలు ఇపుడు గుర్తుకొచ్చాయి. వేగంగా నడుద్దామన్నా నీరసం వాణ్ణి నొక్కి పడుతోంది. భుజం మీది గోనెసంచులు జారుతోంటే మరోసారి పైకెగరేసుకొని ఇంటి ముఖం పట్టాడు.

రోడ్డు పొడవునా పెద్ద పెద్దోళ్ళంతా ఏదేదో మాట్లాడుకుంటున్నారు. దూరంగా జనం గుంపుగా కనిపిస్తే అటుగా వెళ్ళాడు. ఎవరో ఖద్దరు బట్టలు తెల్లటోపీ ధరించిన పెద్దమనిషి తప్పనిసరై వచ్చి మాట్లాడుతున్నట్లుగా అనిపించింది.

"భగత్‌సింగ్ సుభాస్ చంద్రబోస్ గాంధీగారి లాంటోళ్ళు ఎందరో

మహానుభావులు తమ ప్రాణాలు సైతం లెక్క చేయక మనకి స్వతంత్ర్యం తెచ్చి పెట్టారు. అందుకే మనం ఈనాడు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో జీవిస్తున్నాం....” ఉద్రేకంతో ఇంకా ఏదో చెప్పుకుపోతునే వున్నాడు. ఆ ఉద్రేకంలోని భావం ఎమిటో ఇంకా అర్థంకాలేదు అప్పిగాడికి.

“ఇయ్యాల ఏం పండగ బాబయ్యా? ఓ పెద్దమనిషిని అడిగాడు. ఇంకా అర్థంకాని అప్పిగాడు.

అడుక్కుతినే వాడివి నీకెందుకురా? విసుక్కున్నాడా పెద్దమనిషి.

మరోచోట అడిగాడు పట్టువదలని విక్రమార్కుడిలా.

“మనం తెల్లోళ్ళ కాళ్ళకింద బతక్కుండా స్వతంత్రం సంపాదించుకున్నరోజు” కసురుకోకుండా చెప్పాడా పెద్దమనిషి. ఏదో అర్థమయినట్లు తలూపాడు అప్పిగాడు. పక్కనే స్వీట్లు పంచే దృశ్యం కనిపించింది. ఆశగా గుటకలేస్తూ అటుగావెళ్ళి చేయి చాపాడు.

‘దరిద్రుడు. దిష్టి తగులుతుంది’ అనుకుంటూ కొందరు అప్పిగాడి చేతిలో పడేసి పోయారు.

ఈరోజు అదృష్టం పండింది కాబోలు ! అన్నీ కలిసొస్తున్నాయి!! ఈ సంతోషాన్నీ తీపినీ సుబ్బితో పంచుకోవాలని ఆలోచిస్తూ గుడిసె చేరుకున్నాడు.

“సుబ్బీ! సుబ్బీ! కేకలేశాడు.

సమాధానం లేదు. మళ్ళీ పిలిచాడు. సమాధానం లేదు గుడిసె వెనక్కి వెళ్లి చూశాడు. అయినా కనిపించలేదు. కాళ్ళులేని తన సుబ్బి ఎక్కడికి పోతుందబ్బా...?

లోపలికి తొంగి చూశాడు. మూలగా ముడుచుకుని పడివున్న సుబ్బి దగ్గరకెళ్ళి ఒంటి మీద చేయివేసి చూశాడు. వళ్ళంతా సెగలు కక్కుతోంది. జ్వరం మండిపోతోంది. అటూ ఇటూ కదిలించి చూశాడు. నోటివెంట రక్తం కారిపోతోంది. ఏమి చేయాలో అర్థంకాలేదు.

> **“అదేరా ఆగస్టు పదిహేను, గాంధీగారు, సీతామరామరాజు గారు, చంద్రబోసుగారు ఇంకా.... గుర్తుకాక నెత్తిగోక్కుంటూ ఈళ్లందరూ కలిసి స్వాతంత్ర్యం....అదేరా పిచ్చోడ. మనదేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన రోజురా చెప్పకుపోతున్నాడు రంగరాజు ఆ స్వాతంత్ర్యం ఏదో తానే తీసుకొచ్చినట్లు మీసం మెలేస్తూ.**

సేఠ్ ఇచ్చిన డబ్బులు గుర్తొచ్చి చిరిగిన చొక్కా జేబుల్ని తడుముకున్నాడు. కానీ, జేబులో డబ్బులు తగల్లేదు. జేబులన్నీ మళ్ళీ మళ్లీ వెతుక్కున్నాడు. అయినా దొరకలేదు. ఎవరో కొట్టేసినట్టున్నారు.

ఇందాక గుంపు దగ్గరికి వెళ్ళినట్లు గుర్తొచ్చింది. అవకాశం దొరకాలేగాని శవాన్ని పీక్కుతినే మనుషులున్నారని తెలియదుపాపం అప్పిగాడికి. మతి స్థిమితం లేనివాడిలా ఇంకా జేబులు తడుముకుంటూనే వున్నాడు. ఎలాగైనా తన సుబ్బిని కాపాడుకోవాలి. గోనెసంచి భుజాన వేసుకొని చేతిలో కర్ర పట్టుకొని బజార్లవెంట పరుగులు తీశాడు. కానీ ఎక్కడా ఒక్క చిత్తు కాగితం ముక్క కూడా కనిపించలేదు. బజార్లన్నీ వాడిని చూసి వికటాట్టహాసం చేస్తున్నట్లు కనిపించాయి. సేఠ్ దగ్గరకి పరుగెత్తాడు.

“పోరాపో ఇందాకనే గదా ఐదు రూపాయలు ఇచ్చింది.” కసురుకున్నాడు.

“దొరా దొరా రేపు మాలు ఎక్కువ తెత్తా జరా!” కాళ్ళు పట్టుకున్నాడు.

“లేవు పోరాబే!” ఆ కాళ్ళతోనే తన్నాడు. మనసు కరగని రంగరాజు మళ్ళీ బజార్లన్నీ గాలించాడు. ఆశ చావక లాభం లేకపోయింది. సుబ్బికి ఎలా ఉందోనని మళ్లీ గుడిసె దగ్గరికి పరుగులంకించాడు. పడుకున్నది పడుకున్నట్టుగానే ఉంది. అటు ఇటు కదిపి చూశాడు. సుబ్బిలో ఏమాత్రం చలనం లేదు. అప్పటికే సుబ్బి పరలోకానికి వెళ్ళి పోయింది. అప్పిగాడి మనసు భోరున విలపించింది. ఆకాశం దద్దరిల్లేలా ఒక్కసారిగా రోదించాడు.

తొట్టిలో ఉన్న నీళ్ళతో స్నానం చేయించాడు. నుదుట తిలకం దిద్దాడు. శు నకాలు మూగగా రోదిస్తున్నాయి. వాటి కంట నీరు కారుతోంది. సూర్యుడు అప్పిగాడి జీవితంలో చీకటి తెరలు ముసురుకుంటున్నాయి. సుబ్బిని భుజం మీద వేసుకున్నాడు. ఒక చేత్తో పట్టుకున్నాయి. తలకొరివి పెట్టేశాడు. తాను ఒంటరినై బయలుదేరాడు.

ఎక్కడో నిశీధి నుంచి “గోవిందా గోవిందా” అని వినిపించింది. శునకాలే వాడి ఆత్మీయుల్లా రోదిస్తూ అనుసరిస్తున్నాయి. “స్వతంత్ర భారత్‌కీ జై” దూరం నుంచి ఇంకా కేకలు వినిపిస్తూనే ఉన్నాయి. రోడ్డుమీది మనుషులంతా శవాన్ని పీక్కు తినే రాబందుల్లా కనిపిస్తున్నారు అప్పిగాడికి.

“ఇయ్యాల స్వాతంత్ర్య దినోత్సవం” సేఠ్ మాటలు గుర్తుకొచ్చాయి. స్మశానం చేరుకున్నాడు. చుట్టూ కారు చీకటి. సుబ్బి శవం కోసమే ఎదురు చూస్తున్నట్లు నక్కల ఊళలు. స్మశానమంతా కలియజూశాడు. అక్కడక్కడా మండీ మండని చితులు, మరోప్రక్క చితుల పేలుళ్ళు, శవాలు కాలుతున్న కమురు వాసనలు ఇంకోపక్క సమాధుల్లోంచి లేచొచ్చిన శవాల్లా చిన్న చిన్న పొదలు. చుట్టుపక్కల కట్టెలన్నీ ఏరి చితిని పేర్చాడు. మంత్రోచ్ఛారణల్లా నక్కల ఊలలు సుబ్బిని చితి మీద పరుండ బెట్టి చితికి నిప్పంటించాడు.

సుబ్బిలేని ఈ లోకం స్మశానంలా కనిపించింది. ఈ కుళ్ళు సమాజం నుంచి సుబ్బితోపాటే శాశ్వతంగా వెళ్ళిపోవాలని చితి దగ్గరికి వెళ్ళాడు. కానీ ఏదో మూగ రోదన వెన్నుతట్టి వెనక్కు చూశాడు. తననే నమ్ముకుని జీవిస్తున్న మూగ జీవులు మమ్మల్ని కూడా ఈ మనుషుల మధ్య నుంచి దూరంగా తీసుకెళ్ళమంటున్నట్లు చూస్తున్నాయి. అంతటా చిమ్మ చీకటి ఆవరించింది. చితి భగ భగ మండుతోంది.

శునకాలతో గుడిసె చేరుకున్నాడు. గోనె భుజాన వేసుకొని కట్టె చేత పట్టాడు. దీనంగా చూస్తున్న ఆ మూగజీవుల్ని చేత్తో నిమిరాడు. అతని అంతరాత్మలో ఘోషిస్తున్న వేదన. “నన్ను విడిచి వెళ్ళిపోతున్నావా మావాఁ” శూన్యంలోంచి సుబ్బి ఆలాపన. తన సుబ్బిని బతికించలేకపోయిన సమాజంతో అతనికి పనిలేదు. ఎక్కడికో మానవజాతి కనిపించనంత దూరం బయలుదేరాడు. ఆ కారుచీకటిలో..

★

కథలకు ఆహ్వానం

మన చుట్టూ అనేక సంఘటనలు జరుగుతుంటాయి. వీటిలో ఎన్నో సంఘటనలు మనసును మెలిపెడుతుంటాయి. అవి సామాజికమైనవి కావచ్చు. ఆర్థికమైనవి కావచ్చు. మరేదైనా కావచ్చు. వాటిని ప్రతిబింబించే... బాధితులను చైతన్యపరిచే... సామాజిక స్పృహ కలిగించే... కథలను మాకు పంపండి. ప్రచురిస్తాం. <u>ఆకర్షణీయమైన పారితోషికం</u> వుంటుంది. అయితే తెల్లకాగితం మీద ఒకవైపు మాత్రమే రాయాలి. రాతలో ఏడు కాగితాలకు మించకూడదని మనవి.

మా చిరునామా:

కథ శీర్షికకు, ఆదివారం అనుబంధం, ప్రజాశక్తి, మోటూరు హనుమంతరావు భవన్, 21/1, అజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, హైదరాబాదు.

చూద్దామా

వేసవి విడిది మౌంట్ అబూ

మౌంట్ ఆబూ గురించి ఎన్నో చారిత్రక, పురాణ కథలు వినిపిస్తాయి... అందుకు సాక్ష్యాలా అన్నట్లు అనేక గుళ్ళూ ఆశ్రమాలూ కనిపిస్తాయి. పుణ్యపురుషులు తిరుగాడారని చెప్పే ఈ ప్రాంతంలో పర్యటించేందుకూ పవిత్ర స్థలాలను సందర్శించేందుకూ ఇక్కడి ప్రకృతి సౌందర్యానికి దాసోహమనేందుకూ ఏటా సుమారు 15 లక్షలమంది పర్యాటకులు మౌంట్అబూకు వస్తుంటారు. దీన్ని హిల్ స్టేషన్‌గా మార్చిన ఘనత బ్రిటిష్ వారికే దక్కుతుంది. వేసవి తాపాన్ని తట్టుకునేందుకు వారే ఈ ప్రాంతంలో విడిది కేంద్రాలను ఏర్పాటుచేసుకున్నారు. వాటిలో చాలా కేంద్రాలను రాజపుత్ర రాజులు ఆక్రమించుకుని రాజభవనాలుగా మార్చుకున్నారు. రాజులూ పోయాక ప్రభుత్వం వాటిని హెరిటేజ్ హోటళ్లుగానూ స్కూళ్లుగానూ మార్చేసింది. కొన్నింటిని మాత్రం వేసవి విడుదులుగానే ఉంచేసింది.

"వశిష్ఠ మహర్షి వద్ద నందిని అనే కామధేనువు ఉండేది. ఒకానొక సమయంలో అది ఒక లోయలో చిక్కుకుంది. దాన్ని రక్షించమని వశిష్ఠుడు పరమేశ్వరుణ్ణి ప్రార్థించాడు. అప్పుడు శివుడు సరస్వతీ నదిని పంపాడట. ఆ నది తన ప్రవాహంతో గోవును సురక్షితంగా బయటకు తెచ్చింది. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు వశిష్ఠుడు ఓ ఆలోచన చేశాడు. పర్వతరాజైన హిమవంతుడి సోదరుడిని ఈ లోయలో శాశ్వతంగా ఉండిపోవాల్సిందిగా కోరాడు. అప్పుడు ఆ పర్వతాన్ని తెచ్చేందుకు అర్బుద అనే నాగకన్య వెళ్లింది. అందుకే ఈ ప్రాంతానికి అర్బుదా పర్వతం అని పేరు వచ్చింది. కాల క్రమంలో అదే అబూ పర్వతంగా మారింది" అనే కథ ప్రచారంలో ఉంది.



ఎలా వెళ్లాలి?

ఢిల్లీ నుంచి అహ్మదాబాద్‌కు రోజూ ఢిల్లీ అహ్మదాబాద్ మెయిల్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఉన్నాయి. అక్కడి నుంచి మౌంట్అబూకు సుమారు 220 కి.మీ దూరం అబూ రోడ్ స్టేషన్‌లో దిగితే అక్కడి నుంచి 25 కి.మీ. దూరంలో ఉండే మౌంట్ అబూకు ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకూ బస్సులుంటాయి.

అబూకు దగ్గర్లో ఉన్న విమానాశ్రయం ఉదయ్‌పూర్‌లోని దబోక్. రోజూ ఢిల్లీ ముంబయిల నుంచి దబోక్‌కు విమానాలున్నాయి. అక్కడి నుంచి మౌంట్ అబూ 210 కి.మీ దూరం ఉంటుంది.

ఏప్రిల్–జూన్–అక్టోబరు మధ్య సమయాల్లో ఇక్కడ పర్యాటకుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. సన్‌సెట్ పాయింట్‌కు సందర్శకులు బాగా వస్తారు. ఈ పాయింట్ ప్రకృతి సౌందర్యానికి నిలయం. బస్టాండు నుంచి సుమారు ఒకటిన్నర కిలో మీటర్ల దూరంలో ఉంది. ఇక్కడకు తీసుకెళ్లేందుకు బస్టాండు నుంచి గుర్రాలూ ఉన్నాయి. సూర్యాస్తమయం ఎప్పుడు జరుగుతుందా అని సందర్శకులు ఎదురుచూస్తుంటారు. నీలాకాశం క్రమంగా నారింజ, గులాబీ రంగులను సంతరించుకునే ఈ అపురూప దృశ్యాన్ని కళ్లల్లో నిలుపుకునేందుకు తహతహలాడుతుంటారు.

నక్కీ సరస్సు...

ప్రశాంతతకు నిలయం. ప్రకృతి సౌందర్యానికి ఆలవాలం... నక్కీ సరస్సు. ఇక్కడ ఉన్న పర్వతాలను దేవతలు తమ గోళ్ల (నఖములు)తో స్పృశించి ఒక సరస్సును ఏర్పాటుచేశారట. అందుకే దానికి కొండలు.. వాటిపై పచ్చని మొక్కలు... ప్రశాంతమైన సరస్సు... ఆ నీటిపై మెరిసే ఉదయ భానుని నునులేత కిరణాలు.. చల్లని పిల్లగాలి. పక్షుల కిలకిలారావాలు.. వీటన్నింటి మధ్య సరస్సులో పడవ ప్రయాణం.. ఆ అనుభూతిని వర్ణించడానికి మాటలు చాలవు. అందుకే ఈ సరస్సులో ఉదయంపూట విహరించేందుకు సందర్శకులు క్యూలు కడుతుంటారు. పట్టణానికి నడిబొడ్డున ఉన్న ఈసరస్సులో విహరించేందుకు మోటరు పడవలూ, మామూలు పడవలూ ఉంటాయి. సరస్సు చుట్టూ ఉండే కొండల్లో కప్ప ఆకారంలో ఉండే ఓ పెద్ద రాయి ఉంది. దాన్ని చూస్తే గెంతడానికి సిద్ధంగా ఉందా అనిపిస్తుంది! ఇంకా వీటిలో సింహం, ఒంటె ఆకారాల్లో ఉండే రాళ్లూ ఉన్నాయి. ఈ సరస్సును స్థానికులు పవిత్రమైనదిగా భావిస్తారు. మహాత్మాగాంధీ చితాభస్మాన్ని ఇందులోనే కలిపారు. సరస్సు మధ్యలో



నక్కీ సరస్సు



ఓం శాంతి భవనం

గాంధీఘాట్ ఉంది. నక్కీ సరస్సుకు వాయవ్యంగా ఉంది హనీమూన్ పాయింట్. ఇక్కడ స్త్రీపురుషుల ఆకారంలో ఉండే రాళ్లున్నాయి. ఈ ప్రాంతం ఎంతో ప్రశాంతంగా ఉంటుంది. ఈ ఏకాంతాన్ని అస్వాదించేందుకు కొత్త జంటలు హనీమూన్‌కు ఇక్కడికే వస్తుంటారు. ఇక్కడ అత్యాధునిక సౌకర్యాలున్న హోటళ్లున్నాయి.

దుర్గాదేవి కొలువుతీరిన ప్రదేశం ఆధార్ దేవి ఆలయం. పట్టణానికి ఈశాన్యంగా 3కి.మీ. దూరంలో ఉన్న ఈ గుడిని పూర్తిగా రాతిపై చెక్కారు. మౌంట్‌అబూ ప్రజలకు ఆమే ఆరాధ్యదైవం. ఆలయం లోపలికి వెళ్లడానికి 360 మెట్లున్నాయి. గుడికి దిగువ భాగంలో మెట్ల దగ్గర పాలనీటి బావి ఉంది. పాల రంగులో ఉండే ఈ నీళ్లనే ఒకప్పుడు దేవతలూ రుషులూ సేవించేవారని స్థానికుల నమ్మకం.

లింగం లేని శివాలయం

మౌంట్ అబూకు ఈశాన్యంగా సుమారు ఎనిమిది కి.మీ దూరంలో శివాలయం ఉంది . అయితే ఇక్కడ శివుడి విగ్రహమూ లేదు, శివలింగమూ లేదు. గర్భగుడిలోని నేలలో ఒక రంధ్రం ఉంటుంది. ఇది పాతాళానికి దారి అని స్థానికులు నమ్ముతారు. దాన్ని చూస్తున్నట్లు గోడలపై పార్వతీదేవి, విష్ణ్వేశ్వరుల రూపాలుంటాయి. బయట కంచుతో చేసిన పెద్ద నంది ఉంది. ఆలయ ఆవరణంలో పాలరాతితో చేసిన పెద్ద ట్యాంకు ఒకటి ఉంది. దాని పక్కనే పాలరాతితో రూపొందించిన మూడు పెద్ద గేదెల బొమ్మలూ ఉన్నాయి. ఈ ఆలయానికి ఆ హోమగుండం నుంచే నాలుగు రాజపుత్ర వంశాలు జన్మించాయని చెబుతారు.

ఇక్కడికి సమీపంలోనే ఆచల్‌ఘర్ కోట ఉంది. దీన్ని పద్నాలుగో శతాబ్దంలో రాణా కుంభ మహారాజు నిర్మించాడు. ఎత్తయిన కొండపై శత్రుదుర్భేద్యంగా నిర్మించిన ఈ కోటలో చాలా భాగం శిథిలావస్థలో ఉంది.

ఆరావళీ పర్వతాల్లో అత్యంత ఎత్తయిన శిఖరం గురుశిఖర్. దీనిపైనే దత్తాత్రేయుడి ఆలయం ఉంది. పట్టణానికి ఈశాన్యంగా సుమారు 15 కి.దూరంలో, సముద్ర మట్టానికి 1772 అడుగుల ఎత్తులో ఉన్న ఈ ప్రాంతం రాజస్థాన్‌లోకెల్లా ఎత్తయినది. అచల్‌ఘర్ నుంచి గురుశిఖర్‌కు వెళ్లేందుకు మార్గం ఉంది. దారిలో సుందర ప్రకృతి దృశ్యాలు చూపుతిప్పనివ్వవు. దత్తాత్రేయుడి ఆలయానికి బయట పెద్ద ఇత్తడి గంట ఒకటి ఉంది. దీన్ని 1411లో తయారుచేశారట. ఈ ఆలయం దగ్గరి నుంచి చూస్తే మౌంట్ అబూ పట్టణం, చుట్టు పక్కల ప్రాంతాలూ రమణీయంగా ఉంటాయి. పట్టణంలోని మార్కెట్‌కు దక్షిణంగా సుమారు ఏడు కిలోమీటర్ల దూరంలో ఉంది గోముఖ్ దేవాయలం. ఇందులో


దత్తాత్రేయుడి ఆలయం



పాలరాతితో రూపొందించిన ఆవు శిరస్సు ఉంటుంది. ఇందులోనుంచే ఈ గుడిలోని సరస్సులోకి నీరు వస్తుంది. ఇది సరస్వతీ నది నీరు అని స్థానికులు విశ్వసిస్తారు.

ఓం శాంతి భవనం

మౌంట్ అబూలోని ప్రశాంత వాతావరణాన్ని ప్రతిబింబిస్తుంది ఇక్కడి ఓం శాంతి భవనం. దీన్ని 1983లో స్థాపించారు. ప్రజాపిత బ్రహ్మకుమారీ విశ్వ విద్యాలయాల ప్రధాన కేంద్రం ఇదే. ఇందులో ఒక ఆర్ట్ గ్యాలరీ, ఆధ్యాత్మిక విషయాలకు సంబంధించిన మ్యూజియం కోడిగుడ్డు ఆకారంలో ఉండే రాజయోగ ధ్యానకేంద్రం ఉన్నాయి. ఇందులోనే శాంతిమందిరం కూడా ఉంది. ఇది దేశంలోనే మూడో అతిపెద్దహాలు ఆసియాలో అయిదోది. ఇందులో సుమారు నాలుగువేల మంది కూర్చునేందుకు వీలుంది. ఇంత పెద్ద హాల్లో పైకప్పుకు ఆధారంగా ఒక్క స్థంభమూ లేకపోవడం విశేషం.

శీతాకాలం.. పండగ కాలం...

శీతాకాలంలో ఉదయం సమయంలో ముద్దలు ముద్దలుగా మంచు పడుతూంటే మౌంట్ అబూ ధవళవస్త్రధారి అయిన పర్వతాంగనలా ఉంటుంది. ఈ కొండప్రాంతంలో శీతాకాలాన్ని ఎంతో ప్రత్యేకంగా జరుపుకొంటారు. స్థానికులు డిసెంబరు నెలలో నుంచి 31 వరకూ శీతాకాలపు పండగ జరుగుతుంది. ఇందులో గుజరాతీ, పంజాబీ, హర్యానా జానపద కళాకారుల ప్రదర్శనలూ రాత్రి పూట ఫైర్ క్యాంప్‌లూ రాజస్థానీ సంప్రదాయ నృత్యాలూ ఉంటాయి. చుట్టు పక్కల రాష్ట్రాల నుంచి అనేక రకాల హ్యాండ్‌లూమ్ వస్తువులూ బొమ్మాలూ ఇక్కడకు తెచ్చి అమ్ముతారు.

రాజప్రాసాదాలే హోటళ్లు

రాజపుత్రులు ఏర్పాటుచేసుకున్న రాజప్రాసాదాలు కాలక్రమంలో సాంస్కృతిక చిహ్నాలుగానూ హోటళ్లుగానూ మారిపోయాయి. అందులో ముఖ్యమైనది బికనీర్ ప్యాలస్ హోటల్. దీన్ని 1893లో నిర్మించారు. ఇందులో ఇప్పటికీ ఆనాటి రాజులు వేయించిన పెయింటింగులు, కొన్ని అద్భుత కళాఖండాలూ ప్రదర్శనకు ఉంచారు. ఆ తరువాత చూడదగ్గది సన్‌రైజ్ ప్యాలస్ హోటల్. హనీమూన్‌కు వచ్చే వారు ఇందులోనే ఎక్కువగా బస చేస్తుంటారు.

★

ఆరోగ్యం

మూర్ఛవ్యాధి అవగాహన- జాగ్రత్తలు

డా॥ బి. వెంకట రమణ
న్యూరో ఫిజీషియన్
శ్రీనివాస న్యూరోకేర్
అనంతపురం



మూర్ఛవ్యాధి మెదడుకు సంబంధించిన జబ్బు. దీనిని చాలావరకు పూర్తిగా నయం చేయవచ్చు. ఇది అంటురోగం కాదు. మానసిక వ్యాధి అంతకన్నా కాదు. తగిన జాగ్రత్తలు తీసుకుని డాక్టర్ సలహామేరకు మందులు వాడితే వ్యాధిని పూర్తిగా నివారించవచ్చు. మూర్ఛవ్యాధి రావడానికి గల కారణాలను, నివారణా మార్గాలను వ్యాధి లక్షణాలను తెలుసుకుందాం.

మన శరీరం మీద సర్వాధికారాలు మెదడుకు వుంటాయి. శరీరంలోని ఏ ఏ అవయవాలు ఎప్పుడు ఏ పనిచేయాలో మెదడు నిర్దేశిస్తూ ఉంటుంది. మెదడు కొన్ని లక్షల కణాల సముదాయంతో నిండి ఉంటుంది. మన శరీరంలోని ఏ అవయవంగాని, ఏదైనా పనిచేయాల్సివచ్చినప్పుడు, మెదడులోని కణాలు ఆ అంగానికి రసాయనిక సంకేతాల ద్వారా... విద్యుత్ సంకేతాల ద్వారా అవసరమైన ఆజ్ఞలను చేరవేస్తాయి. కొన్ని పరిస్థితుల్లో, మెదడులోని కణాలు విద్యుత్ సంకేతాలను అస్తవ్యస్తంగా విడుదల చేయడం జరుగుతుంది. అప్పుడు ఆ వ్యక్తి మూర్ఛకు లేక ఫిట్స్‌కు లోనవుతాడు. మెదడు కణాలలో ఇలాంటి అస్తవ్యస్త పరిస్థితి కొద్దిసేపు మాత్రమే వుంటుంది. వెనువెంటనే ఆ కణాలు సక్రమంగా పనిచేయడం మొదలయి ఆ వ్యక్తి మూర్ఛ నుంచి తేరుకొంటాడు. ఆ వ్యక్తి కాళ్లు చేతులు కొట్టుకోవడం, నాలుక కరుచుకోవడం వంటి చేష్టలకు గురికావచ్చు. మెదడులోని నరాల జబ్బు తీవ్రతను బట్టి కొందరిలో ఫిట్స్ కొద్దిగా మాత్రమే రావచ్చు. మరి కొందరిలో ఎక్కువగా రావచ్చు కూడా.

కారణాలు

దయ్యాలు, భూతాల వల్ల చేతబడులు, క్షుద్రశక్తుల వల్ల మూర్ఛ వస్తుందని పామరజనంలో ఒక నమ్మకం ఉంది. అది కేవలం మూఢ నమ్మకం మాత్రమే. ఫిట్స్ వచ్చినప్పుడు అరచేతుల్లో తాళాలు పెట్టి పిడికిలి మూయడం, నెత్తిన బిందెతో నీళ్లు కుమ్మరించడం వంటివి అర్థంలేని నిష్ప్రయోజనమైన పనులు. మూర్ఛ మెదడుకు సంబంధించిన జబ్బు అని అందరూ అర్థం చేసుకోవాలి. ఇది మానసిక జబ్బు లేదా అంటు వ్యాధి కాదు. మూర్ఛ రావడానికి అనేక కారణాలున్నాయి. 70 శాతం మూర్ఛ రోగుల్లో ఇదమిద్ధంగా ఫలానా కారణం అని కూడా తెలియకపోవచ్చు. వంశపారంపర్యంగా వచ్చే వారికి సాధారణంగా 20 సంవత్సరాల వయస్సులోపే ఫిట్స్ వస్తాయి. వంద మందిలో ఏ ఇద్దరు ముగ్గురుకో మాత్రమే ఈవ్యాధి వంశపారంపర్యంగా సంక్రమిస్తుంది. పసికందుగా వున్నప్పుడే ఈ వ్యాధి సంక్రమిస్తే, అది కష్టమైన కాన్పు వల్లకాని, ఏదైనా అంటువ్యాధి ప్రభావం వల్లకాని, శిశువు శరీరంలో గ్లూకోజ్, కాల్షియం, పాళ్లు బాగా తగ్గిపోవడం వల్లకాని జరుగవచ్చు. చిన్న పిల్లలలో మెదడువాపు వ్యాధి, మెదడుకు చీము పట్టడం, మెదడుకు సంబంధించిన క్షయ వంటి జబ్బుల వల్లకాని, మూర్ఛ వ్యాధి రావచ్చు.

20 నుంచి 30 సంవత్సరాల తర్వాత మూర్ఛ మొదటి సారిగా కనబడితే మెదడులో కణుతులు ఏర్పడడంగాని, రక్త నాళాలు చిట్లి గడ్డకట్టడం కాని, మెదడుకు సంబంధించిన అంటువ్యాధులు సోకడం వల్లకాని పుర్రె ఎముక విరిగి మెదడుకు దెబ్బ తగలడం మూలంగా లేదా మద్యం, మత్తు మందుల ప్రభావం కారణంగా గాని, ఆ వ్యాధి సంభవించవచ్చు.

రకాలు

మెదడులోని వేరువేరు భాగాలలో విడుదలయ్యే అస్తవ్యస్థమైన విద్యుత్ సంకేతాల మూలంగా, ఆయా వ్యక్తులకు మూర్ఛ వివిధ రకాలుగా రావచ్చు.

మూర్ఛ వ్యాధిని స్థూలంగా రెండు రకాల గా విభజించవచ్చు.

1. పాక్షికమైన మూర్ఛ (సాధారణమైనది). ఇందులో రెండు తెగలున్నాయి.
2. సర్వసాధారణమైన మూర్ఛ

పాక్షిక మూర్ఛకు గురైన వ్యక్తికి స్పృహ బాగానే ఉంటుంది. తనచుట్టూ ఏం జరుగుతోందో అంతా అతనికి తెలుస్తూ వుంటుంది. దీనిని సామాన్య పాక్షిక మూర్ఛ వ్యాధి అంటారు. ఇలాంటి పాక్షిక మూర్ఛ లక్షణాలలో రోగిని ఒక పక్క చేతి వేళ్లు, కాలి వేళ్లు, కంటి రెప్పలు, మూతి కండరాలు దవడ లాగడం, శరీరం ఏ భాగంలోనైనా ఒక రకమైన అపూర్వ స్పర్శానుభవం కల్గడం లేక తిమ్మిరి పట్టడం, కంటి ముందు అసాధారణ దృశ్యాలు కన్పించడం, చెవులలో వింత ధ్వనులు వినిపించడం, ముక్కుకు వింత వింత వాసనలు అనుభూతి కలగడం గమనించవచ్చు.రోగి పూర్తిగా స్పృహ కోల్పోకుండా ఉండి, తాను ఏంచేస్తున్నాడో తెలియని పరిస్థితిలో, తన చుట్టూ వున్న ప్రపంచాన్ని మరచిపోయి, బట్టలు లాగేసుకోవడం, గుండ్రంగా చుట్టూ తిరగడం వంటి చేష్టలతో వింతగా ప్రవర్తించవచ్చు. దీన్ని సంకీర్ణ పాక్షిక మూర్ఛవ్యాధి అంటారు. విద్యుత్ సంకేతాల అస్తవ్యస్తత మెదడు మధ్య భాగంలోని కాడ నుంచి మెదడులోని అన్ని భాగాలకు వ్యాపించవచ్చు. దీనినే సర్వసాధారణ మూర్ఛరోగం అంటారు. ఎపిలెప్సీలో మహా మూర్ఛ రోగం ముఖ్యమైనది. ఇది రావడానికి కొన్ని క్షణాల ముందు ఆ వ్యక్తికి కొన్ని సూచనలు కనపడకపోవచ్చు. కాని తనను కంట్రోల్ చేసుకోవడానికి అతనికి చేతకాక, స్పృహ కోల్పోయి కిందపడిపోవడం జరుగుతుంది. నిలుచొని ఉన్నవాళ్లు ఒక్కసారిగా పడిపోతారు. ఇది ప్రమాదకరమైన తరహా మూర్ఛ వ్యాధి. ఇందులో విపరీతంగా కండరాలు కదలికలకు గురై, ఒళ్ళంతా వంకరలు తిరిగిపోతుంది. మనిషి బిగదీసుకుపోతాడు. తర్వాత నిద్ర ముంచుకొని వచ్చి నిద్రలోకి జారుకొంటాడు. ఈ రకం ఎపిలెప్సీలోనే నాలుక కొరుక్కోవడం, దుస్తుల్లో మల మూత్రాలు విసర్జించడం జరుగుతుంది. ఈ పరిస్థితి 2 నుంచి 5 నిమిషాల సేపు ఉండవచ్చు. పెటిట్‌మాల్ ఎపిలెప్సీ పరిస్థితి కేవలం 10 నుంచి 45 సెకన్ల కాలం మాత్రమే ఉంటుంది. మళ్లీ అతుడు మామూలు మనిషి అయిపోతాడు. ఇటువంటి స్వల్ప కాలిక మూర్ఛ, రోజులో 30 నుంచి40 పర్యాయాలు కూడా వచ్చే అవకాశం ఉంది. కళ్ల రెప్పలు కొట్టుకోవడం గమనించవచ్చు. ఒక్కోసారి, శరీరమంతా లేదా ఒక భాగం ఉన్నట్టుండి విపరీతమైన కదలికలకు గురిఅయ్యే రీతిలో "మయోక్లోనిక్ ఎపిలెప్సీ" రావచ్చు. ఇది సాధారణంగా నిద్రలేచిన వెంటనే రావచ్చు. పళ్లు తోముకొనేప్పుడు బ్రష్ చేజారి పడిపోవడం, కాఫీ, టీ తాగేప్పుడు గ్లాసు జారిపోవడం వంటివి దీని లక్షణాలు. ఈ రకమైన మూర్ఛ వంశపారంపర్యంగా వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.పాక్షిక మూర్ఛ వ్యాధికి కారణాలు తెలుసుకోవచ్చు. కాని సర్వసాధారణ మూర్ఛకు గల కారణాలు కనుక్కోలేక పోవచ్చు.

(మరిన్ని వివరాలు పైవారం) ★

వేసవిలో చర్మ సంరక్షణ ఇలా

వేసవిలో ఎండ తీవ్రత ఎక్కువగా వుంటుంది. అయినా బయటకు వెళ్లాల్సిందే. పనులు చేసుకోవాల్సిందే కదా. అదేవిధంగా... అన్ని ఋతువుల్లో లాగే వేసవిలోనూ సౌందర్య పోషణ చేసుకోవాలి. చిన్నచిన్న జాగ్రత్తలు పాటిస్తే అంతా సుందరంగా కనిపిస్తుంది. మరి మనం తీసుకోవాల్సిన జాగ్రత్తలేంటో ఓసారి చెప్పుకుందామా!

- వేసవిలో సూర్యరశ్మిలోని అతి నీల లోహిత కిరణాల వల్ల చర్మం కమిలిపోతుంది. దీన్ని 'టానింగ్' అంటారు. దీని నుంచి తప్పించుకునేందుకు స్ట్రాబెర్రీ పళ్ళ గుజ్జు, ఖీరాల ముద్ద చక్కగా పని చేస్తాయి.
- చర్మం కమిలిన చోట పలుచని టొమాటో చక్రాలను తేలికగా రుద్దాలి. 20-25 నిముషాల తరువాత కడిగేయాలి.
- ఒక చెంచా బాదాముల పొడి, 2 చిన్న చెంచాల పాలు, చిటికెడు పసుపు కలిపి లేపనం చేయాలి.
- సబ్బుకు బదులుగా సున్నిపిండి వాడడం లాభదాయకం.
- ఒక చిన్న చెంచా సోయాబీన్స్ పొడి, పెరుగు కలిపి రాసుకుంటే చక్కని బ్లీచ్ జరుగుతుంది.
- ఖీరాలు, టొమాటోల గుజ్జులో బాదాముల పొడి కలిపి, వారానికి కనీసం మూడుసార్లు ముఖానికి రాసుకోవాలి.
- ఒక చిన్న చెంచా నిమ్మరసంలో ఒక చిన్న చెంచా పసుపు కలిపి రాసుకుంటే, చర్మం ప్రకాశవంతంగా ఉంటుంది.

ఇవి తెల్సా...!

- మెలనోమా సమస్యలు, 25-29 ఏళ్ల యువతుల్లో అత్యధికంగా ఉన్నాయని పరిశోధనలు చెబుతున్నాయి. నలభైల్లో పడిన మహిళల్లోనూ పెరుగుతున్నాయి.
- ఇతర రకాలైన క్యాన్సర్ల కన్నా, మెలనోమా వల్ల యువతులు త్వరగా మరణిస్తున్నారు.
- తొంభైకన్నా ఎక్కువ రకాలైన క్యాన్సర్ల కన్నా ప్రాణాంతకమైన సూర్యరశ్మి వల్లే ఏర్పడుతున్నాయి.
- గడచిన దశాబ్దంలో క్యాన్సర్లు మెలనోమా వల్లే బాగా పెరిగాయి. ఎండలో ఎక్కువగా గడిపినట్లయితే, 20 ఏళ్ళ వయసులోనే చర్మం బాగా పాడయ్యే ప్రమాదం ఉంది.

చేయాల్సినవి... చేయకూడనివి...

- వేసవిలో సన్‌బాత్ తీసుకోకూడదు.
- అవసరానికి మించి ఎండలో తిరగకూడదు. ఉదయం 10 గంటల నుంచి, సాయంకాలం నాలుగు వరకూ సూర్యరశ్మిలోని అల్ట్రా వయొలెట్ కిరణాల శక్తి అత్యధికంగా ప్రభావితం చేస్తాయి.
- బయటికి వెళ్లే ముందు 18-35 ఎస్.పి.ఎఫ్ (సన్ ప్రొటెక్షన్ ఫ్యాక్టర్) వున్న సన్ స్క్రీన్ లోషన్ రాసుకోవాలి. ఏదోలే అనుకోకుండా చక్కగా రాయాలి.
- చర్మాన్ని రక్షించే కాటన్ వస్త్రాలను ధరించాలి.
- చర్మానికే కాదు, ఎండవల్ల కళ్లకూ హాని కలుగుతుంది. కళ్ళను యువి కారణాల నుంచి రక్షించుకునేందుకు తగిన కళ్ళజోడు పెట్టుకోవాలి.
- అప్పుడప్పుడు చర్మ వైద్యుల వద్ద చర్మ పరీక్ష చేయించు కుంటుండాలి.
- ఎస్ పి ఎఫ్ వల్ల అతినీలలోహిత కిరణాల దుష్ప్రభావం కొంతవరకూ తగ్గుతుంది. ఇది కూడా చర్మం సెన్సిటివిటీ మీద ఆధారపడి ఉంటుంది. ఈ ఎస్ పి ఎఫ్ ప్రభావం ఎక్కువసేపు ఉండాలంటే, బాగా ఎండలో తిరిగేవారు, సన్ స్క్రీన్ లోషన్‌ను ప్రతి రెండు గంటలకు ఒకసారి రాసుకోవడం అవసరం. ఎక్కువ సున్నితమైన చర్మానికి ఎక్కువ ఎస్‌పిఎఫ్ గల సన్ స్క్రీన్ రాసుకోవాలి.

★

తెలుసా!



తుప్పు పట్టని ఇనుపస్థంభం

ఇనుముతో తయారు చేసిన వస్తువులన్నీ తుప్పు పడుతుంటాయి. కానీ ఢిల్లీలో కుతుబ్‌మినార్ సమీపంలో ఒక ఇనుపస్థంభం 1, 600 సంవత్సరాల నుండీ తుప్పు పట్టకుండా నిలిచి వుంది. రసాయన విశ్లేషణాన్ని బట్టి చూస్తే ఈ స్థంభానికి 99.72 శాతం ఇనుమును వాడారని తేలింది. ఇది ప్రపంచ అద్భుతాల్లో ఒక అద్భుతమని చెప్పవచ్చు. ఇప్పుడున్న స్టీలు ఫ్యాక్టరీలేవీ కూడా ఇంత గట్టి స్థంభాన్ని సృష్టించలేవట. ప్రాచీన లోహశోధకులకు ఇనుము తుప్పు పట్టకుండా నిర్మించగల నేర్పు తెలుసు. అయితే దురదృష్టవశాత్తూ ఈ రహస్యం వారితోనే అంతమైపోయింది. ఈ స్థంభం 6 టన్నుల బరువుంటుంది. ఇదంతా ఒకటే ముక్క. దీనికి మధ్యలో ఎక్కడా అతుకులు లేవు. దీని ఎత్తు 7.3 మీటర్లు (24 అడుగులు).

నాలుగు కొమ్ముల జంతువు



నాలుగు కొమ్ములున్న జింకను ఎప్పుడైనా చూశారా! లేదా! చౌసింఘా (నాలుగు కొమ్ముల జింక) ప్రపంచం మొత్తం మీద నాలుగు కొమ్ములున్న ఏకైక జీవిగా గుర్తింపు పొందింది. వీటికి మామూలుగా వుండే రెండు కొమ్ములతో పాటు మరో జత చిన్న కొమ్ములు వుంటాయి. ఇవి ఆసియాలోని జింకలలో కెల్లా చిన్నవిగా కూడా గుర్తింపుపొందాయి. ఇవి 0.6 మీటర్ల ఎత్తుండి ఒక్కొక్కటి 16 కేజీల బరువు వుంటుంది. ఇవి పొడిగా వుండే ఆకు రాల్చే అడవుల్లో ఎక్కువగా కనిపిస్తాయి. మన దేశంలో జమ్మూ నుండి తమిళనాడులోని మధుమలై వరకు వున్న అడవుల్లో ఇవి విస్తరించి వున్నాయి. గుజరాత్‌లోని బార్దా మరియు గిర్ అడవుల్లో కూడా ఇవి కన్పిస్తాయి. ఇవి గుంపుగా తిరగవు. ఒంటరిగా గానీ, జతగా గానీ మాత్రమే కనిపిస్తాయి.



కొండల నగరం రోమ్

ఇటలీలో టైబర్ నది ఒడ్డున గల రోమ్ పట్టణం అత్యంత సుందరమైనది, చరిత్ర ప్రసిద్ధి పొందినది. ఈ పట్టణాన్ని క్రీస్తుపూర్వం 753లో కవలలైన రోమలస్, రోమస్ నిర్మించారని చరిత్ర చెబుతున్నది. పురాతన పట్టణాన్ని వారు ఏడు పర్వతాలపై నిర్మించారు. ప్రస్తుతమున్న రోమ్ పట్టణం 20 పర్వతాలకు విస్తరించింది. ఇటలీలోకెల్లా పెద్ద పట్టణమిదే. ఇది చర్చిలు, పాలెస్‌లు, మ్యూజియంలు, ఫౌంటెన్లు, తోటలతో అత్యంత సుందరంగా విలసిల్లుతున్నది. పర్యాటకులను విశేషంగా ఆకర్షించే చరిత్ర ప్రసిద్ధి పొందిన కట్టడాలలో ముఖ్యంగా పాంథియాన్, కొలోసియం, మూడు అంతస్తుల కాన్‌స్టాంటైన్ డోమస్‌ఔరా (గోల్డెన్ హౌస్), మార్కస్ ఔరెలస్, బాత్స్ ఆఫ్ కార్కల్లా డయోక్లెటియన్, ట్రాజాన్ కట్టడాలను చెప్పకోవచ్చు. వీటిలో కొన్ని పురాతన యుద్ధాలు, దాడులలో పాక్షికంగా దెబ్బతిన్నవి. ప్రస్తుతం చలన చిత్ర పరిశ్రమ విశేషంగా అభివృద్ధి పొందిన నగరాలలో ఇదొకటి.

నారింజపూలు ధరించే ఆచారం



ఐరోపాలో పెళ్లి కుమార్తెలు నారింజ పూలు ధరిస్తుంటారు. ఈ ఆచారం చాలా విచిత్రమైన పరిస్థితుల్లో వాడుకలోకి వచ్చింది. చాలా ఏళ్ళ కిందట స్పెయిన్‌లో రాజోద్యానవనాన్ని చూసే ఒక తోటమాలికి ఓ కుమార్తె ఉండేది. వాళ్లు పేదవాళ్ళు కావడం చేత ఏళ్ళు పైబడుతున్నా ఆమెకు వివాహం కాలేదు. అదే సమయంలో స్పెయిన్ రాజుకు ఆఫ్రికా రాజు ఒక నారింజ మొక్కను కానుకగా పంపించాడు. ఆ రోజులలో ఐరోపాలో నారింజ మొక్కలు అరుదుగా వుండేవి. దీంతో రాజు దీనిని చాలా శ్రద్ధగా పెంచడం మొదలు పెట్టాడు. నారింజ మొక్కను తన దేశానికి కూడా తీసుకువెళ్ళాలనే ఉద్దేశ్యంతో ఫ్రాన్స్ రాయబారి ఒక కొమ్మను ఇవ్వవలసిందిగా స్పెయిన్ రాజును అర్థించాడు. అయితే ఆయన అందుకు అంగీకరించలేదు. ఈ విషయం తెలిసిన తోటమాలి కూతురు తన తండ్రికి కూడా తెలియకుండా నారింజ మొక్క కొమ్మను దొంగిలించి ఫ్రాన్స్ దేశ రాయబారికి పెద్ద మొత్తానికి విక్రయించింది. ఆ ధనాన్ని తాను ప్రేమించిన వ్యక్తిని వివాహమాడేందుకు వరకట్నంగా చెల్లించింది. అసాధ్యం అనుకున్న తన వివాహాన్ని సుసాధ్యం చేసిన నారింజ చెట్టు పట్ల గౌరవ సూచకంగా ఆమె తన వివాహం రోజున నారింజ పూలనే తలలో ధరించింది. ఆమె తలలో తెల్లటి నారింజ పూలు ఎంతో అందంగా కన్పించడంతో వివాహానికి వచ్చిన వారంతా పెళ్లిళ్లప్పుడు నారింజ పూలనే అలంకరించుకోవడం ప్రారంభించారు. క్రమేణా ఈ ఆచారం యూరప్ అంతటా వ్యాపించింది.

జీరో సైజు తర్వాత...?!



"అమ్మో...అరటిపండా! వద్దొద్దు"

"వావ్! స్వీటా? నాకు ఇష్టమేకానీ వద్దులే"

"చాల్బాలు. ఇలా అయితే...ఇంక జీరో సైజ్‌కి చేరుకున్నట్టే..."

లాంటి మాటలు మనం ఈమధ్య తరచూ వింటున్నాం. అమ్మాయిల బుర్రల్లో తిష్ట వేసుకొని కూర్చున్న జీరో సైజ్ ఫీవర్ అందుకు కారణం. ఎంతసేపూ బాలీవుడ్ తారలు కరీనా కపూర్‌లానో...ప్రియాంక చోప్రాలానో, హాలీవుడ్ నటీమణి ఏంజలీనా జూలీలానో రాత్రికి రాత్రి తయారవ్వాలనుకుంటున్నారు. దాంతో తిండి తినడం మానేసి అస్తిపంజరాల్లా తయారవుతున్నారు. సమస్యలను కొని తెచ్చుకుంటున్నారనడాన్ని ఓ నెటిజన్ తన ఊహాజనిత చిత్రాల్లో ఇదిగో ఇలా చూపించాడు. ప్రముఖ హాలీవుడ్ తారలు, పాప్‌సింగర్లు తిండి మానేసి జీరోసైజును దాటిపోతే ఎలా వుంటారన్న ఊహా చిత్రాలను రూపొందించి నెట్‌లో పెట్టేశాడు. కనీసం వీటిని చూసైనా జీరోసైజ్ మోజును వదిలించుకుంటారని ఆయన ఆశ.

కలం స్నేహం

OK

హాయ్ చిన్నారి నేస్తాలూ!

మీకూడా వీళ్లలాగా కలంస్నేహం చెయ్యాలని ఉందా? మరి ఆలస్యం ఎందుకు? ఒక పోస్ట్‌కార్డు తీసుకొని మీ పేరు, వయసు, తరగతి, స్కూలు, హాబీలు, చిరునామా రాయండి. ఆ తర్వాత మీ కలర్‌ఫోటోను అతికించి పోస్ట్ చెయ్యండి. అంతే ఎంచక్కా ప్రచురిస్తాం. అన్నట్టు, ఈ పుస్తకాన్ని మీ స్నేహితులకూ చూపించి అన్ని విషయాలు చెప్పండి. వాళ్లకు కూడా కలం స్నేహం చెయ్యాలని వుంటే కార్డు మీద రాసి మాకు పంపమనండే. మరి మా అడ్రస్ కలంస్నేహం, ప్రజాశక్తి, మోటూరు హనుమంతరావు భవన్, 21/1, ఆజమాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, హైదరాబాద్.

పేరు: వి.వీరాస్వామి యాదవ్
చదువు: 10వ తరగతి
వయస్సు: 15 సం॥
స్కూలు: జడ్.పి.జి.హెచ్. ఎస్
లక్ష్యం: డాక్టర్ కావడం
హాబీలు: చదవటం, టీవీ చూడటం, క్రికెట్ ఆడటం
చిరునామా: వి.వీరాస్వామి యాదవ్,
సన్నాఫ్ :వి. రాములు యాదవ్
పానగల్, మహబూబ్‌నగర్ జిల్లా.

పేరు: తాళ్లూరి సుధీర్ చౌదరి
చదువు: 10వ తరగతి
వయస్సు: 15 సం॥
స్కూలు: జడ్.పి.ఎమ్.సి
లక్ష్యం: శాస్త్రవేత్త కావడం
హాబీలు: న్యూస్ చదవటం, క్రికెట్ ఆడటం
చిరునామా: తాళ్లూరి సుధీర్ చౌదరి,
సన్నాఫ్ :టి. వెంకటేశ్వర్లు
చౌదరిపురం, కూసుమంచి, ఖమ్మం.

పేరు: షేక్ ముజావర్ గౌస్ సందాని
చదువు: 10వ తరగతి
వయస్సు: 15 సం॥
హాబీలు: చదవటం, క్రికెట్ ఆడటం, బొమ్మలు వేయడం
చిరునామా: షేక్ ముజావర్ గౌస్ సందాని,
సన్నాఫ్ :షేక్ ముజావర్ కబీరుద్దీన్,
కొమ్మూరు, కాకుమాను, గుంటూరు.

పేరు: బి. రవళిక
చదువు: 10వ తరగతి
వయస్సు: 15 సం॥
హాబీలు: చదవడం, టీవీ చూడడం
చిరునామా: బి. రవళిక,
డాటరాఫ్ :బి. యాదగిరి
ఎన్టీఆర్ నగర్, పానగల్, నల్లగొండ.

పేరు: ఒమ్మ మమత
చదువు: 10వ తరగతి
వయస్సు: 15 సం॥
స్కూలు: జడ్.పి.పి.ఎస్
లక్ష్యం: ఇంజనీర్ కావడం
చిరునామా: ఒమ్మ మమత,
డాటరాఫ్ :ఒమ్మ వెంకన్న
గుండెపూడి, మర్రిపెడ, వరంగల్.

పేరు: బి. లలిత
చదువు: 10వ తరగతి
వయస్సు: 15 సం॥
స్కూలు: జడ్.పి.జి.హెచ్. ఎస్
హాబీలు: టీవీ చూడటం,దిన పత్రికలు చదవటం
చిరునామా: బి. లలిత,
డాటరాఫ్ :బి. రాములు, ఎన్టీఆర్ నిలయం-2,
ఎన్టీఆర్ నగర్, పానగల్లు, నల్లగొండ.

పేరు: బొడ్డుపల్లి హరికృష్ణ
చదువు: 10వ తరగతి
వయస్సు: 15 సం॥
స్కూలు: జడ్.పి.జి.హెచ్. ఎస్
లక్ష్యం: ఎడిటర్ కావడం
హాబీలు: పెయింటింగ్, మిమిక్రీ చెయ్యటం, క్రికెట్ ఆడడం
చిరునామా: బొడ్డుపల్లి హరికృష్ణ,
సన్నాఫ్ :బి. అంజయ్య,
ఎన్టీఆర్ నిలయం, పానగల్లు, నల్లగొండ.

పేరు: ఎమ్. గోపాలకృష్ణ
చదువు: 10వ తరగతి
వయస్సు: 15 సం॥
స్కూలు: ఎ.పి.ఆర్. స్కూల్
లక్ష్యం: డాక్టర్ కావడం,హాబీలు: టీవీ చూడటం, చదవటం
చిరునామా: ఎమ్. గోపాలకృష్ణ,
సన్నాఫ్ :మసనం రామారావు,
దొడ్డ దేవరపాడు, వీరుల పాడు (మండలం),
కృష్ణా (జిల్లా)

పేరు: జి. భరత్ కుమార్
చదువు: 10వ తరగతి
వయస్సు: 15 సం॥
స్కూలు: జడ్.పి.ఎస్.ఎస్
లక్ష్యం: ఇంజనీర్ కావడం
హాబీలు: పుస్తక పఠనం, ప్రజాసేవ
చిరునామా: జి. భరత్ కుమార్,
సన్నాఫ్ :జి. యాకయ్య,
నర్సింహుల పేట, వరంగల్.